బావిలో శవాలు!

సికిందర్

శ్యామల డాబా మెట్లెక్కి వచ్చి, పిట్టగోడ నానుకొని నిల్చొని, నా ప్రాణాలెగిరిపోయేలా ఒక్క కేక పెట్టింది. "ఫోన్ వచ్చింది! మిమ్మల్ని బాస్ పిలుస్తున్నారు!"

మొదటిది నా ప్రాణాలెగిరిపోవడం, రెండవది టైప్ మిషన్ మీద నా వ్రేళ్ళు తప్పుకొట్టేయడం, రెండూ ఒకేసారి జరిగాయి.

చటుక్కున తలెత్తిచూశా నామెని.

"ఫోన్ వచ్చింది! బాస్ పిలుస్తున్నారు మిమ్మల్ని!" అర్చిందామె మళ్ళీ.

నాకు నీరసం కమ్ముకుంది. ఈ అరుపుల్ని అసలు భరించలేకపోతున్నాను. మొదట్లో కళ్ళతో మింగేసేలా చూసి భయపెట్టేది. కాని క్రమంగా నాకది అలవాటై పోవడంతో, పద్ధతి మార్చి ఇలా గొంతు చించుకొని అరవటం మొదలుపెట్టింది. ఏదో ఒకరకంగా నన్ను

భయపెట్టడం ఆమె ముఖ్యోద్దేశం.

"ఎందుకలా అరుస్తావు సైరన్ లా?" అన్నాను రెచ్చిపోతూ.

"సైరన్‌కి భయపడటానికి మీరేమైనా దొంగనా?"

"నేనిక్కడ తైపు కొట్టుకుంటున్నాను — జూద గృహాలమీద రిపోర్టు! ఏకాగ్రత అవసరం!"

"మీ రిపోర్ట్సు అంటే నాకు వళ్ళుమంట!"

"నీ అరుపులంటే నాకూ వళ్ళుమంట!"

"నా అరుపులకు లొంగకపోయారో, కరుస్తానంతే!"

"అది కూడా మొదలు పెడ్తావా? నీకు నేనెందుకు లొంగాలి?"

"నన్ను కట్టుకున్నందుకు! నాకు మొగుడయినందుకు!"

"ఛ ఛ! భాష.... భాష!" నెత్తి కొట్టుకున్నాను, "నీతో ఇహ చచ్చినా మాట్లాడను. మితిమీరి పోతున్నావు. నడువ్, ఫోన్‌మీద ఎవరు; పెద్ద బాసా? చిన్న బాసా?"

"చిన్న బాస్!" ఆమె కఠినంగా చెప్పి మెట్లు దిగసాగింది.

నేను అలసటగా లేచి ఆమె వెనుక వెళ్ళాను.

ఆమె కిచెన్‌లోకెళ్ళి గలగల చప్పుళ్ళు చేయసాగింది.

నేను ముందుగదిలోకెళ్ళి ఫోన్ ఎత్తాను. "హలో సర్?"

"సుందర్, నువ్వెంటనే రా!" శర్మ గొంతు పలికింది.

"ఎక్కడికి?"

"బాస్ ఇంటికి!"

"దేనికి?"

"తెలీదు, రాబర్టు ఫోన్ చేసి వెంటనే రమ్మన్నాడు."

"కానీ నేనిక్కడ రిపోర్టు వ్రాస్తున్నాను."

"నేనూ వ్రాస్తున్నాను ఇక్కడ—ఎడిటోరియల్!"

"మీరు వెళ్తున్నారా?"

"అవును, నువ్వెంట నేరా!" అతను ఫోన్ పెట్టేశాడు.

నేనూ పెట్టేసి టైము చూశాను. అరవుతోంది. గబగబా తల దువ్వుకొని శ్యామలని పిల్చాను. "వెళ్తున్నాను, తలుపేసుకో!" అన్నాను.

"ఎక్కడికి?"

"బాస్ ఇంటికి, రమ్మన్నారు."

"ఎప్పుడొస్తారు?"

"ఆయన వెళ్ళమన్నప్పుడు."

"మీకసలు నేనెందుకు!" అర్చిందామె కెవ్వున.

ఆమెని కొట్టబోతూ ఆగిపోయాను. ఆవేశం అణచుకున్నాను అతి ప్రయత్నంమీద.

"బాస్‌తో చెప్పి నీ సైరన్ పీకించేస్తాను!" అన్నాను వెంటనే అక్కడ్నుంచి కదిలి వెళ్ళిపోతూ.

2

బంగళా ఆవరణలో బైక్ ఆపి దిగాను.

వరండాలో నీరజ ఎదురు చూస్తోంది. ఆమెని చేరుకుని ఏమిటన్నట్టు చూశాను.

"పదండి, మీ కోసమే చూస్తున్నారు" అందామె లోపలికి దారితీస్తూ.

"ఏం జరిగింది?" అడిగాను ఆమెతో నడుస్తూ.

"ఎవరో యువతి వచ్చింది."

"ఎవరామె?"

"ఏమో, బాస్ శరణుకోరి వచ్చింది—"

"బాస్ మరీ కరుణామయుడై పోతున్నారు" అన్నాను. ఇద్దరం మెట్లెక్కి పైన గదిలోకి ప్రవేశించాం.

అక్కడ వాళ్ళంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఎడిటర్ శర్మ, బాస్ బాడీగార్డు రాబర్టు, ఒక యువతి, మా బాస్.

మా బాస్, బ్లేడ్ పత్రిక యజమాని, శ్రీ మహీందర్ రావు అందరికంటే గంభీరంగా, హుందాగా కూర్చున్నాడు. ఆయన చేతిలో సిగరెట్ కాల్తోంది. అరవై పైబడ్డా ఆయన శరీరంలో చురుకుదనం పోలేదు. ముఖంలో తేజస్సు కళ్ళలో తీక్షణత తగ్గలేదు.

ఆయన్ను ఒకచోట కూర్చోబెట్టి వ్యవహారాలన్నీ చూసేందుకు మేమంతా ఉన్నాం. ఆయనకు పూర్తి శారీరక విశ్రాంతిని చేకూర్చగలం. కానీ మానసికంగా ఆయనకు విశ్రాంతిలేదు. నిరంతర గడియారంలా ఆలోచిస్తూనే వుంటాడు. కొత్త కొత్త ప్రణాళికలు రూపొందించి మా మీదకు వదులుతుంటాడు.

ఆ ప్రణాళికలన్నీ సమాజం బాగుకోసమే!

సమాజంలోని అవినీతినీ, అన్యాయాల్నీ, అక్రమాల్నీ సమస్త దుర్మార్గాల్నీ నిర్మూలించి ఆరోగ్యవంతం చేయడమే జీవిత లక్ష్యంగా కంకణం గట్టిన మహోన్నత వ్యక్తిగా దేశవ్యాప్తంగా ఆయనకు గుర్తింపూ ఆదరణా వున్నాయి. మేధావి వర్గాల్లో ఆయనపట్ల ఎనలేని గౌరవాభిమానాలున్నాయి.

ఆయన సంస్కర్తమాత్రమేకాదు, దానశీలుడుకూడా. ఏ స్వచ్ఛంద సేవా సంస్థలకైనా ఆయన అండదండలుంటాయి; ప్రోత్సాహముంటుంది. అనాథలకీ, అన్యాయాలకు బలైన వాళ్ళకి ఆయన చేతులనుండి ధారా

పాతంగా విరాళాలు ప్రవహిస్తుంటాయి.

అవినీతి—అది ఏ రూపంలో, ఏ స్థాయిలోనున్నా—దాన్ని వెలికిలాగి ప్రపంచానికి వెల్లడిచేసేవరకూ ఆయన విశ్రమించడు. అందుకు ఆయన చేపట్టిన దర్పణం 'బ్లేడ్' పత్రిక. దీని ఖ్యాతి దినదిన ప్రవర్థమానమవుతూ ఉజ్వలంగా వెలిగిపోతోందంటే, అది పూర్తిగా పత్రికా వ్యవహారాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకొనే మా బాస్ వల్లనే.

ఇలాంటి పత్రికలకి సహజంగానే శత్రువులుంటారు. ఆటంకాలు సృష్టిస్తారు. కాలరాయడానికి యత్నిస్తారు. ఇవన్నీ గతంలో ఆయన ఎన్నోసార్లు ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అలాంటి శక్తుల్ని తిప్పికొట్టాడు.

ఒకసారి జీవన్‌లాల్ అనే ఒక డ్రోవ్ స్మగ్లర్, ('పరువా? ప్రాణమా?' నవల చదవండి) మరోసారి సక్సేనా అనబడే ఒక బ్లాక్‌మార్కెటీర్, ('కీర్తి దాహం' నవల చదవండి). ఇంకా ఎందరెందరో మహానుభావులు వేసిన ఎన్నో ఎత్తుగడల్ని చిత్తుచేయడమేగాక; వాళ్ళ వాళ్ళ అంతరంగిక జీవితాల్లోకి తొంగి చూసి, తలపడి, బహిర్గతంచేసి, అశేష ప్రజాభిమానాన్ని చూరగొనడం జరిగింది.

ప్రతి ప్రతిఘటనలోనూ పత్రిక ప్రతిష్ట పెరుగుతూనే వచ్చింది తప్ప పడిపోలేదు.

అయితే ఇప్పుడు బాస్ అందర్నీ ఇలా సమావేశపరిచాడంటే మళ్ళీ ఏదైనా ఉపద్రవం వచ్చి పడిందా?

ఆయనకు నమస్కరించి కూర్చున్నాను.

నా చూపులు ఆ యువతిమీద పడ్డాయి. పాతికేళ్ళుంటాయి. అవివాహిత. అంత అందంగా లేదుగానీ,

ఆకర్షణీయంగా అలంకరించుకుంది. ఆమె కళ్ళలోకి సూటిగా రెండు క్షణాలు చూసిన నాకు కలవరపాటు కలిగింది. అవి బాగా ఎర్రబడి వున్నాయి. ఆమె ఏడ్చి వుంటుంది.

"ఏం జరిగింది, సర్?" అన్నాను బాస్ వైపు తిరిగి.

ఆయన నోట్లోంచి సిగరెట్ తీసి నన్ను చూశాడు, క్రోధాన్ని కక్కుతున్న కళ్ళతో.

"ఈమెమీద అత్యాచారం జరిగింది, సుందర్. తప్పించుకొని ఇక్కడకొచ్చింది."

"ఎవరు చేశారు, సర్?"

"లిఫ్ట్ ఇస్తానన్న ఒక లోఫర్!"

"ఎలా, సర్?"

"నువ్వు చెప్పమ్మాయ్" అన్నాడాయన ఆమెవైపు తిరిగి.

ఆమె సంకోచించింది.

"మీ పేరు?" అడిగాను.

"సుమిత్ర—" మళ్ళీ కొనసాగించ లేదు.

"ఎక్కడుంటారు?"

"పంజా గుట్టలో."

"ఏం చేస్తుంటారు?"

"ఉద్యోగం-సెనోని."

"ఇప్పుడు ఏం జరిగిందో వివరంగా చెప్పండి."

"మేం తక్షణం చర్య తీసుకుంటాం!" శర్మ అన్నాడు దృఢంగా.

ఆమె తలవంచుకుని నెమ్మదిగా చెప్పసాగింది.

"ఈ రోజు నేను ఆఫీసు నుంచి నాలుగున్నరకే వచ్చేశాను, వంట్లో బాగాలేకపోతే. బస్ స్టాప్ దగ్గర

నిలబడి ఎదురు చూస్తున్నాను. అంతలో ఈ కారు వచ్చింది. అందులో వున్నాయన పెద్దమనిషిలా కనిపించాడు. నా తండ్రి వయసులో వున్నాడు—మర్యాద స్తుడిలా తోచాడు. అతడు కారాపి లిఫ్ట్ కావాలా అనడిగాడు. నేను తత్తరపడలేదు—అది నాకు ప్రతి రోజూ అలవాటే. అలా ఎన్నో సార్లు వెళ్ళాను. అందులో తప్పులేదు. ఒక్కొక్కసారి నేనే చొరవచేసి అడుగుతాను. ఇతన్ని చూసి నాకు మంచి అభిప్రాయం కల్గడంతో, తిరస్కరించడం సభ్యత కాదనిపించింది...."

"చెప్పండి."

"నేను థాంక్స్ చెప్పి ఎక్కి అతని ప్రక్కన కూర్చున్నాను. కారు పోనిచ్చాడు. అప్పుడు నన్ను ప్రశ్నించడం మొదలెట్టాడు. నా పేరేమిటి, ఏం చేస్తుంటాను, ఎక్కడ వుంటాను, నాకెవరున్నారు.... ఇలా ఎన్నో అడిగాడు. అన్నిటికీ ఓపిగ్గా చెప్పాను. అప్పుడు తన గురించి మొదలు పెట్టాడు — తానొక ఫ్యాక్టరీలో పెద్దాఫీసరు. మంచి జీతం. ఎన్నో సదుపాయాలు. పెళ్ళయింది. పిల్లల్లేరు. భార్య ఊరికెళ్ళింది. ఇంట్లో యెవరూ లేరు. నాకూ యెదురుచూసే వారెవరూ లేరు—తనతో ఓ రెండు గంటలు గడపగలనా?"

"అలా అన్నాడా?"

"నిర్లజ్జగా అన్నాడు!"

"మానర్‌లెస్ పంక్!" బాస్ తిట్టాడు.

"అప్పుడు మీరేం చేశారు?" అడిగాను.

"అతన్ని చూసి నేనెంత పొరబడ్డానో తెలుసుకున్నాను. ఈడ్చి కొట్టబోయాను. అతడు నా చేయి మెలితిప్పి పట్టుకొని, 'ఇదుగో అమ్మాయ్! నీ కిష్టముంటే

అవుననూ, లేకపోతే కాదనూ. ఇలా చెయ్యొత్తావంటే రెచ్చిపోతాను. నేను లిఫ్ట్ ఇచ్చినవాళ్ళెవరూ నాకు లిఫ్ట్ ఇవ్వకుండా పోలేదు!' అన్నాడు."

"అప్పుడు—?"

"నాకు చెడ్డ భయంవేసింది! అరవాలనుకున్నాను. కానీ అందరికీ ముఖం చూపించుకోలేను తర్వాత. డోర్ తీసి దూకేయాలనుకున్నాను, కానీ వేగంగా పోనిస్తున్నాడు. నన్ను చింపేయమన్నాను. వికటంగా నవ్వి ఇంకా వేగం పెంచాడు. అప్పటికి కారు యెటెటో వెళుతోంది—వేరే తోవలో—నా ఇంటివైపుగాక. భయంతో నాకేమీ పాలుపోలేదు. అతడు నవ్వుతూ మధ్య మధ్యలో ఏదో వాగుతూ డ్రైవ్ చేస్తున్నాడు—ఒకచేత్తో నా చెయ్యి పట్టుకొని."

ఆమె వూపిరి పీల్చుకుంది. "చివరకి కారు ఈ వీధిలోకి తిరిగినప్పుడు నేను తెగించి ఏదో ఒకటి చేసేయాలనుకున్నాను—అతని ఇల్లెక్కడో చెప్పలేదు. ఈ ప్రాంతాలే ఉండొచ్చు. ఏ క్షణంలోనైనా చేరుకోవచ్చు. ఈలోపే తప్పించుకోవాలి! అంతే, అప్పుడింకేమీ ఆలోచించకుండా అతని చెయ్యిపట్టి కొరికేశాను—"

"అప్పుడేం జరిగింది?"

"అతను కెవ్వున అరిచాడు. నా చెయ్యివదిలేసి కొట్టబోయాడు. కానీ కారు కంట్రోలు తప్పి యెదురుగా యెలక్ట్రిక్ స్తంభాన్ని గుద్దుకోబోవటంతో సడన్ బ్రేకు వేశాడు—అదే సమయంలో నేను డోర్ తీసి దూకేశాను బయటికి—వెనక్కి తిరిగి పరుగు ప్రారంభించాను. అతను వెనుకనుంచి అరుస్తున్నాడు, రాత్రి నా ఇంటికొచ్చి అంతుచూస్తానని! అప్పుడు వీధిలో యెవరూ లేరు—ఆ

సంఘటన యెవరూ చూడలేదు. నేనలాగే పరిగెత్తు కుంటూ గేటు తీసివుంచేటే ఈ ఇంట్లో కొచ్చేశాను."

ఆమె చెప్పడం పూర్తి చేసి, బాస్ వైపు తిరిగింది.

"ఇక్కడ మిమ్మల్ని చూస్తాననుకోలేదు! అంతా దైవ సంకల్పం. మిమ్మల్ని చూసి నా ఆనందానికి హద్దు లేకుండా పోయాయి....మీ గురించి చాలా విన్నాను. నేను అనాధని. నాలాంటి అనాధలకి మీరే దిక్కు, సర్వం. మా పట్ల మీరు చూపుతున్న సానుభూతి సహకారానికి మీరంటే నాకెంతో భక్తి గౌరవం ఏర్పడ్డాయి. మీరు నాకు పూజ్యనీయులు. ఆ భగవంతుడే నన్నిలా మీ పాదాల చెంతకు పంపాడని—"

ఆమె కన్నీళ్ళను ఆపుకోడానికి ప్రయత్నిస్తోంది.

బాస్ ఆమె చేతిని తట్టాడు మృదువుగా.

"అధైర్యపడకు, మేమంతా వున్నాం."

అప్పుడు నా వైపు తిరిగి—"అరవిందా? ఆ బ్లడీ లోఫర్ మీద ఫైలు సిద్ధం చెయ్!" అన్నాడు.

"అలాగే సర్" అన్నాను ఆమె వైపు తిరుగుతూ, "అయితే అతని ఇల్లెక్కడో చెప్పలేదా?"

ఆమె తలూపింది అడ్డంగా. "చెప్పలేదు."

"పేరు?"

"అది కూడా చెప్పలేదు, ఏ ఫ్యాక్టరీలో పని చేస్తాడో కూడా చెప్పలేదు."

"కారు నెంబర్ చూశారా?"

"అప్పుడు నా పరిస్థితి మీకు తెలుసు. యెందుకు చూస్తాను? కానీ అది అంబాసిడర్ కారు—నల్లరంగుది."

"ఈ వీధిలోకి తెచ్చాడంటే ఇల్లు ఇక్కడే వుంటుంది" అన్నాడు శర్మ.

"ఈ వీధిలో ఫ్యాక్టరీలో పనిచేసే ఆఫీసరెవరూ లేడు" అన్నాడు రాబర్ట్.

"వీధిని గాక మొత్తం లొకాలిటీని చూడండి" అన్నాడు బాస్.

"అవును, వీధి అంటే ఈ ఒక్క వీధికే వర్తిస్తుంది" శర్మ అన్నాడు.

"నేను కనుక్కుంటాను" అన్నాన్నేను.

"అతను రాత్రి ఇంటికొస్తానన్నాడు...." అందామె భయంగా.

"అవును, మీరిప్పుడు ఇంటికెళ్ళరా?"

"వెళ్ళను! ఇంట్లో నాకెవరూ లేరు."

"అయితే ఎవరింటికైనా వెళ్ళి వుండండి."

"నా కెవరూ తెలీదు."

బాస్ అన్నాడు. "ఫరవాలేదు, ఈ రాత్రి నువ్విక్కడే వుండు. ఇక్కడ నీకు భయంలేదు. నా సెక్రటరీ నీకు తోడుగా వుంటుంది—" నీరజవైపు తిరిగి—"ఈమెని నువ్వు జాగ్రత్తగా చూసుకోవాలి" అన్నాడు.

నీరజ తలూపింది.

బాస్ నా వైపు తిరిగాడు. "నువ్వీ ఏరియాలో దర్యాప్తు చెయ్. అతన్ని ట్రేస్ చేయగలవేమో చూడు. లేకపోతే రాత్రి ఈమె ఇంటి దగ్గర నిఘావుండు—ఆ లోఫర్ వస్తే వెంటాడి—వెల్ ఏం చెయ్యాలో నీకు తెలుసు."

నేను తలూపాను.

తర్వాత బాస్ ఆమెవైపు తిరిగాడు. "నువ్వేం భయపడకు. ఇందులో నీ పేరెక్కడా రాదు. ఇది పోలీసు దర్యాప్తుకాదు, మా పత్రిక స్వంత ఇన్వెస్టిగేషన్. ఆ

లోఫర్ ఇంకేం తప్పుడు పనులు చేస్తున్నాడో ఆరాలుతీసి, ప్రజల్లో అపఖ్యాతిపాలు చేస్తాం. ఆ శిక్ష చాలదూ?"

ఆమె తలూపింది, చేతులు జోడిస్తూ.

3

పోస్టల్ అధికారుల ధృవీకరణలో ఆ ఏరియాలోనూ, ఇంకా ఆ చుట్టుప్రక్కలలోనూ ఫ్యాక్టరిలో పనిచేసే ఆఫీసరు ఎవరూ నివశించడంలేదని తేలింది.

అక్కడ స్థానికంగా జరిపిన దర్యాప్తులో తమ వీధుల గుండా అటువంటి కారు ఏదీ పోతూ కన్పించలేదని చెప్పారు అక్కడి పౌరులు.

సుమిత్ర చెప్పిన ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర, రోడ్డు మీద సడెన్ బ్రేకు వేసిన చిహ్నాలేవీ కనిపించలేదు.

బాలానగర్‌లో ఆమె వేచివుండిన బస్ స్టాప్ దగ్గర కూడా ఆ కారును గురించిన సమాచారం దొరకలేదు.

ఇదంతా పూర్తిచేసుకొని ఆఫీసుకి నిరుత్సాహంగా తిరిగి వచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. శర్మ అంతా తెలుసుకొని ఆలోచనలో పడ్డాడు.

"అయితే అతను రాత్రి ఆమె ఇంటికొస్తాడంటావా?" అన్నాడతను.

అసిస్టెంట్ ఎడిటర్ మోహన్ అందించిన చల్లటి మంచినీళ్ళు తాగి అడ్డంగా తలూపాను.

"నమ్మకం లేదు, సర్. అది ఆవేశంలో చేసిన ఉత్తుత్తి బెదిరింపులా వుంది."

"అవును, అలా వెళితే ఆమె పందిని కూడగట్టుకొని అతన్ని మసాలా రుబ్బేయొచ్చు."

"ఏం చేద్దాం?"

"మర్చిపోదాం,"

"కానీ బాస్ మర్చిపోరు, నా కప్పగించిన పనిని."

"యూ ఫూల్!"

"నేనా?"

"నువ్వే, నీకో పాయింట్ తట్టిందా?"

"ఏ పాయింట్, సర్?"

"అతనిల్లు మన బాస్ యింటి ప్రాంతాల వుంటేనే కదా ఆ వీధిలోగుండా ప్రయాణిస్తాడు?"

"అవును...."

"మరి రోజూ అతడి రాకపోకలు ఆ వీధిలోగుండానే సాగాలి కదా?"

"అవును...."

"రేపుదయం ఆ వీధిలో కాపుకాయ్, ఫ్యాక్టరీకి పోతూ కన్పిస్తాడు."

"ష్యూర్?"

"ష్యూర్."

"కానీ ఆ ప్రాంతాల అటువంటి కారుని చూడ లేదన్నారుకదా ప్రజలు...."

"అప్పుడు చూడలేదన్నారు—ఎప్పుడు? ఆ యువతిని తీసుకొచ్చిన సమయంలో. నువ్వక్కడ అపార్థం చేసుకున్నావు."

ఉలిక్కిపడ్డాను. అవును, అది నిజమే!

"మరి పోస్టల్ వాళ్ళ ఇన్ఫర్మేషన్ సర్?"

"వాళ్ళకి తెలియకుండా అతను ఇటీవలే ఇల్లుమారి వుండొచ్చు."

"అయితే రేపు మీరు చెప్పినట్టు చేస్తాను."

"గుడ్!" అన్నాడతను లేస్తూ, "పద, పోదాం! నన్ను ఇంటిదగ్గర దింపేయ్."

ఇద్దరం కిందకొచ్చి బైక్ ఎక్కి బయల్దేరాం.

నా ఆలోచనలు ఆ యువతి చుట్టే తిరుగుతున్నాయి. ఆమెని గురించి ఆలోచిస్తున్నకొద్దీ ఆందోళన ఎక్కువవుతోంది. ప్రపంచంలో ఏకాకిగా వుండటం—అందునా ఆడవాళ్ళకి ఎంత దుర్భరంగా వుంటుందో!

"ఏమిటి బాబూ ఆలోచిస్తున్నావ్" శర్మ అన్నాడు వెనకనుంచి.

"శ్యామల గురించి...." పరధ్యానంగా అన్నాను.

"ఏమిటామె గురించి?"

"ఆమె ఎందుకలా అరుస్తుందో అర్థంగావడంలేదు."

"ఆడవాళ్ళు అరుస్తారు" అన్నాడతను.

"ఎందుకరుస్తారు?"

"నీకు సైకాలజీ తెలీదు."

"మీకేం తెలుసు?"

"నువ్వామెని పట్టించుకోవడంలేదు."

"అయితే?"

"నిర్లక్ష్యం చేస్తున్నావ్."

"చేస్తే?"

"యెంతసేపూ బయిటి గొడవలే కాదు బాబూ, భార్యల ముచ్చట్లు కూడా చూడాలి!"

"నాకు భార్యలులేరు, భార్య వుంది. ఒక్కటి!"

"నీకు గ్రామర్ కూడా తెలీదు!"

"మరి నాకేం తెలుసు?"

"ఆమెచేత చాకిరీ చేయించుకోవడం!"

"సరే, అయితే ఈ ఉద్యోగానికో నమస్కారం పెట్టేసి ఊటీ వెళ్ళిపోతాను. ఆమెతో షికార్లు కొడతాను."

"అక్కర్లేదు, బాస్‌తో చెప్పి నీ పని వేళల్ని క్రమబద్ధకంగా చేయిస్తాను. వారానికొక రోజు సెలవు ఇప్పిస్తాను."

"అప్పుడామె అరుపులు తగ్గుతాయంటారా?"

"తగ్గుతాయి, నువు సరిగా చూసుకుంటే."

"చూద్దాం."

ఇంటికి వెళ్ళి భోజనం చేసి బెడ్ మీదకు చేరాను అలసటగా. అంతసేపూ శ్యామల ఏమీ మాట్లాడలేదు. నేనూ పట్టించుకోలేదు. చివరకి నా ప్రక్కన చేరి సంగతులు అడిగింది. టూకీగా చెప్పాను.

"దేశంలో మా ఆడవాళ్ళకి సెక్యూరిటీ లేకుండా పోయింది!" అంటూ వాపోయిందామె.

నేను నిద్రపోయాను.

4

ఉదయం యెనిమిది గంటలకి నేను బయల్దేరుతుండగా ఫోను మ్రోగింది.

"హలో, సుందర్!" రాబర్టు అరిచాడు కంగారుగా.

"యస్, రాబర్టు?"

"కొంప మునిగింది! మీరు వెంటనే రండి!"

"ఏమిటి మీర నేది? ఏం జరిగింది?"

"ఆ అనాథ పారిపోయింది!"

"ఏమిటీ! యెందుకు పారిపోయింది?"

"ఫోన్ మీద చెప్పే విషయం కాదు, వెంటనే రండి!" ఫోన్ పెట్టేశాడతను.

నేను అయోమయంగా నిలబడ్డాను. శ్యామల వచ్చి, "ఏం జరిగింది?" అనడిగింది.

నేను ఫోన్ పెట్టేసి బయట కురికాను—వెనుకనుంచి

అరుపులు విన్పిస్తోంటే....

బాస్ ఇంట్లో బైక్ దిగి లోపల దూరికాను. నీరజ యెదురుకాలేదు. పైకురికి ఆ గదిలో ప్రవేశించాను. వాళ్ళంతా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. బాస్, శర్మ, రాబర్టు, నీరజ.

నన్ను చూసి నిశ్శబ్దమయిపోయారు. బాస్ నన్ను కూర్చోమన్నాడు.

"ఏం జరిగింది సర్?" అడిగాను అయోమయంగా.

బాస్ అన్నాడు నిదానంగా. "ఆ అమ్మాయి—ఆ అనాథ వెళ్ళిపోయింది సుందర్, నాతో చెప్పకుండానే. ప్చ్, కృతజ్ఞత లోపించింది లోకంలో."

"యెందుకు వెళ్ళిపోయింది, సర్?"

బాస్ రాబర్టుని చూసి చిటికవేశాడు.

రాబర్టు అరిచాడు ఆవేశంగా. "ఆ ఆడది ఒక దొంగ! హీన విలువల సెరజాణ! ఛీ ఈజె టార్ట్—"

బాస్ వారించాడు, "ఆవేశం వద్దు రాబర్టు, దూషణ వద్దు!"

"అయాం సారీ, సర్" నొచ్చుకున్నాడు రాబర్టు, "రాత్రి తొమ్మిది గంటలకే ఆమె నిద్రపోయింది, కదూ సిస్టర్?" నీరజ తలూపడంతో తిరిగి అన్నాడు, "బాస్ ప్రక్క గదినే ఆమెకు కేటాయించాం. ఆమె లోపల నుంచి గడియపెట్టుకుని పడుకుంది వంటరిగా. నేనిక్కడ అన్నీ సరిచూసుకుని, పదిగంటలకి విక్టర్, చంద్రన్‌లు డ్యూటీకి రావడంతో వెళ్ళిపోయాను. కానీ తెల్లారుతుండగానే వాళ్ళు కంగారుగా ఫోన్ చేసి పిల్చారు. నేను వెంటనే ఇక్కడకొచ్చి చూస్తే—నాకు మతిపోయింది!

"నీరజ ఏడు గంటలకి తలుపు కొడితే ఆమె

పలకలేదు. చాలాసేపు కొట్టి విరమించుకుంది. ఇంతలో బయట చంద్రన్ ఆమె గది కిటికీనుంచి ఏదో వ్రేలాడు తూండటం చూసి వెళ్ళాడట—అవి కిటికీ తెరలు. ఒకదానికొకటి ముడివేసి తాడులా చేసి దాని సహాయంతో-గాడ్! ఆమె ఆడదికాదు—

"చంద్రన్ అప్పుడు కేకలువేస్తూ పైకివెళ్ళి తలుపులు బద్దలుకొట్టి చూస్తే లోపల ఆమెలేదు! రాత్రి యెప్పుడో కిటికీలోంచి పారిపోయింది, గార్డ్సు కంటబడకుండా. వాళ్ళిద్దర్నీ వెంటనే డిస్మిస్ చేసి పంపించేశాను.

"అప్పటికింకా బాస్ లేవలేదు. నేను సాహసించి ఆయన గదిలోకి వెళ్ళి లేపాను. ఆయన బద్ధకంగా అగు పించారు. వంట్లో యెలాగో వుందన్నారు. ఆయన అంత సేపు యెప్పుడూ నిద్రపోలేదు. సుస్తీ చేసిందనుకొని వెంటనే డాక్టర్ని పిలవమని నీరజకు చెప్పాను. ఆమె అలా వెళ్ళిందో లేదో, నా దృష్టి బెడ్ ప్రక్కన దీనిమీద పడింది—ఈ కాటన్ వుండమీద—చూడండి, ఇది క్లోరోఫాంలో తడిపింది!"

చటుక్కున అందుకొని చూశాను. గుండె వేగంగా కొట్టుకుంది.

రాబర్టు అన్నాడు ఆవేశంగా. "ఆ బిచ్ బాస్ని దాంతో స్పృహ పోగొట్టి సేఫ్లోని డాసియర్ ఎత్తుకు పోయింది, సుందర్!"

అదిరిపడ్డాను, "యెవరి డాసియర్?" అరిచాను.

"నందకిషోర్ కాపికా!"

"ఓ మై గాడ్!"

"అయోమయ మాటలతో నమ్మించింది, మొసలి కన్నీళ్ళతో వశపర్చుకుంది, చాలా తెలివిగా తన పని

కానిచ్చుకుంది—ఐ విల్ కిక్ హార్ టు డెత్!"

"శాంతించు, గాబర్లు" బాస్ మందలించాడు.

"సారీ సర్, ఇది పూర్తిగా నా అసమర్థతవల్లనే...."

బాస్ నాకేసి తిరిగాడు, "ఆ డాసియర్ చాలా ముఖ్యమైనది సుందర్. నీకు తెలిసివుండదు, కాషిక్ చరిత్రంతా అందులో వుంది. ఆ యువతి యెవరో మనకి తెలియదు. ఆడవాళ్ళ కన్నీళ్ళకి నేనిట్టే కరిగిపోతాను. అది నా బలహీనత. భగవంతుడు నాకు మెత్తని హృదయమిచ్చాడు. కానీ యే కన్నీరూ ఇంతవరకు నన్నిలా మోసపుచ్చలేదు. అందుకే ఈ అమ్మాయి కన్నీటిమాటున కపట ఉద్దేశ్యం ఉంటుందనుకోలేదు. సులభంగా ఫూల్ని చేసింది. నాకిప్పుడు ఆ డాసియర్తో పాటు ఆ అమ్మాయి కూడా కావాలి సుందర్."

"అలాగే, సర్! ఆమెని పట్టుకు తీర్తాను!"

"కానీ ఆమె యెవరసలు?" అన్నాడు శర్మ.

బాస్ అన్నాడు, "తనమీద మనం డాసియర్ సిద్ధం చేసినట్టు కాషిక్కి ఎలాగో తెలిసింది. తస్కరించడానికి ఈ అమ్మాయిని పంపాడు. కానీ ఈమె తెలుగు అమ్మాయి, ఇక్కడి నివాసి. కాషిక్ ఢిల్లీలో వుంటాడు. ఆమెకు అతనితో సంబంధాలెట్లా యేర్పడ్డాయి? ఈమె ఢిల్లీలోనే వుంటుందా? లేక ఇక్కడ కాషిక్ మనుషుల తరఫున పని చేస్తోందా?"

"ఇక్కడ కాషిక్ మనుషులున్నారా, సర్?"

"చెప్పలేం, అతనిది పెద్ద ఇల్లీగల్ ఆర్గనైజేషన్."

నీరజ గాభరాగా పరిగెత్తివచ్చింది. "సర్, ఢిల్లీ నుంచి టెలెక్స్!"

ఆమె వణుకుతున్న చేతులలో ఒక స్లిప్ని బాస్

కందించింది. అది చదివి ఆయన ముఖం కందిపోయింది! దాన్ని శర్మకిస్తూ, "ఢిల్లీ బ్యూరోకి కనెక్షన్, క్విక్!" అనుసరించాడు లేస్తూ. నీరజ విసురుగా పరుగుతీసింది.

స్లిప్ చదివిన శర్మ, "ఓహ్, గాడ్!" అన్నాడు.

దాన్ని నేను లాక్కుని చూశాను. నా కళ్ళు చల్లబడి పోయింది!

అందులో ఇలా వుంది.

Sivakumar shot dead last night-body found early morning—police moved in—office ran sacked—d. c. of d disappeared — instructions.

"దిసీజ్ టూ మచ్!" అరిచాడు రాబర్టు కూడా చదివి.

బాస్ ఒక్క ఉదటున కిటికీ దగ్గరకెళ్ళి బయటకు చూస్తూ ఆ షాక్‌ని సడలించుకున్నాడు.

మేం బొమ్మల్లా కూర్చుని వున్నాం.

బాస్ మా వైపు తిరిగి సిగర్ వెలిగించుకున్నాడు వణుకుతున్న చేతులతో.

"కుమార్ ....దట్ డామ్ లిటిల్ ఫూల్. ఆ డాసియర్ అందించినందుకు మనసారా అభినందించాలనుకున్నాను."

"కాపిక్‌ని సర్వనాశనం చెయ్యాలి సర్!" అన్నాడు రాబర్టు ఆవేశంగా.

నీరజ టెలిఫోన్‌తో ఉరికివచ్చింది. కార్డ్‌ని గదిలోని ఎక్స్‌టెన్షన్ సాకెట్‌లోకి పెట్టి, బాస్‌కి రిసీవర్ అందించి, "మిస్టర్ చోప్రా, సర్!" అంది.

బాస్ రిసీవరందుకొని, "ఎస్, చోప్రా?...." అన్నాడు.

రెండు నిముషాలు అవతలి మాటలు శ్రద్ధగా విని అప్పుడన్నాడు. "వెల్, అక్కడ కూడా డాసియర్‌ని కాజేశారన్నమాట, డూప్లికేట్ కాపీని. ఇక్కడా ఆ

డాసియర్ పోయింది, చోప్రా. ఇప్పుడు మర్డర్. ఈ మూడు పనులూ అతనివే—ఆ చీడపురుగు కౌషిక్! వెంటనే రంగంలోకి దూకండి, హంతకుడ్ని పట్టుకోండి! హంతకుడు పోలీసులకి చిక్కకూడదు ముందు—కౌషిక్ వెళ్ళి రక్షించుకుంటాడు పలుకుబడితో. అర్థమైందా? పోలీసులకంటే ముందు హంతకుడ్ని పట్టుకుని కౌషిక్ నేరాన్ని పలికించండి—కన్ఫెషన్ రికార్డుచేసి అప్పుడు అప్పగించండి పోలీసులకి. అంతవరకూ పోలీసులకి ఏ ఇన్ఫర్మేషన్ ఇవ్వకూడదు.... వెరీ వెల్, వెరీ గుడ్.... కుమార్ తల్లికి టెలిగ్రాం పంపండి, తర్వాత నేను వచ్చి కలుసుకుంటాను.... సుందర్ ఇప్పుడు బయల్దేరుతాడు."

రిసీవర్ని నీరజకిస్తూ, "ఢిల్లీ ఫ్లయిట్ ఎన్ని గంటలకి?" అన్నాడు బాస్.

"పదీ యాభైకి, సర్!"

"వెంటనే సుందర్కి టికెట్ బుక్ చెయ్!"

"అలాగే, సర్!" ఆమె పరుగుతీసింది.

నేను అయోమయంగా చూస్తున్నాను.

బాస్ అన్నాడు నావైపు తిరిగి, "నువ్వెంటనే బయల్దేరు సుందర్, చోప్రాని కలుసుకో. అతనొక్కడే దీన్ని హేండిల్ చేయలేడు. దిలీప్ ఇంకా కొత్తవాడు. నువ్వెళ్ళి వాళ్ళ సహాయంతో హంతకుడ్ని ట్రేస్ చెయ్! పట్టుకుని కన్ఫెషన్ కక్కించు! కౌషిక్కి ఈ మర్డర్లో నుంచి తప్పించుకునే అవకాశాల్ని మృగ్యం చెయ్! రాబర్టు ఇక్కడ ఆ అమ్మాయిని ట్రేస్ చేస్తాడు, ఆ డాసియర్ ఇంకా కౌషిక్కి చేరివుండదు!"

5

మూడురోజుల క్రిందటి సంగతి — ఆఫీసుకు ఒక ఇన్సూర్ చేయబడ్డ పార్శిల్ అందింది ఢిల్లీ నుంచి. నేను ప్రక్కన వుండగా శర్మ దాన్ని విప్పి చూశాడు. అందులో, నీటుగా టైపు చేయబడ్డ 12 ఫ్రూల్స్ కేపు షీట్లు, ఒక కవరులో ఎనిమిది ఫోటో నెగెటివ్ లూ, వాటి పాజటివ్ ప్రింట్సూ వున్నాయి.

వాటితో జత చేసిన స్లిప్ మీద 'Complete Investigative Report on Mr. N.K.K.' అనివుంది.

శర్మ సంతోషంతో ఒక్క కేక వేసి, వాటిని తీసుకొని బాస్ దగ్గర కురికాడు.

అప్పుడా రిపోర్టు గురించి నాకేమీ తెలియదు. కానీ ఢిల్లీలో నందకిషోర్ కౌశిక్ అనబడే ఒక మల్టీ మిలియనీర్ ని బ్లాక్ మార్కెటీర్ గా, డ్రగ్ ట్రాఫిక్కర్ గా స్మగ్లర్ గా రాజకీయ పక్షాలు ఆరోపించడం తెలుసు. అతని ఆగడాలు మితిమీరి పోవడంతో మా బాస్ ఢిల్లీ బ్యూరో చీఫ్ రిపోర్టర్ ని సమగ్ర దర్యాప్తునకు ఆదేశించడం కూడా తెలుసు. చోప్రా తక్షణం తన స్టాఫ్ రిపోర్టర్ శివకుమార్ తో రంగంలో దూకడమూ తెలుసు—అంతే!

ఇప్పుడు డాసియర్ అందింది ఇలా....

తరువాత దాని గురించి శర్మని అడిగాను. అతను టూకీగా వివరాలు చెప్పాడు. కౌశిక్ మీద వున్న ఆరోపణలన్నీ రుజువయ్యే సాక్ష్యాధారాలన్నీ లభించాయి. ఢిల్లీలోని నిత్యావసర వస్తువుల మార్కెట్ చాలావరకు అతని హస్తాలోనే వుంది. వాటిని దొంగచాటుగా నిల్వచేసి బ్లాక్ చేసే గిడ్డంగుల సమాచారం లభించింది—

ఫోటోలతో సహా. నేపాల్ నుంచి భారీ ఎత్తున మత్తు ద్రవ్యాల్ని ఢిల్లీలో దిగుమతిచేసుకొని యువతని పాడుచేస్తూ తద్వారా లాభాలార్జిస్తున్న ప్రత్యక్ష నిదర్శనాలు కూడా లభించాయి. ఉద్యోగాల పేరిట స్త్రీలను మోసపుచ్చి విదేశాలకి విక్రయించే అతని బోగస్ సంస్థ బండారం కూడా బైటపడింది.

అంతేగాక ఏఏ అధికారుల్ని తన ఏఏ బ్లాక్ మెయిల్ పద్ధతుల ద్వారా ఏ విధంగా లోబర్చుకున్నాడో—ఆ పురాణం కూడా వుంది.

అతని ఈ సంపూర్ణ రామాయణమంతా నెలాఖరు సంచికలో రావాలని నిశ్చయించాడు బాస్. ఆ పై వారంలో కౌషిక్ దేశంలో ఘరానా నేరస్థుడిగా ముద్రపడి, అపఖ్యాతిపాలై జైలుకెళ్ళి ముఖం దాచుకుంటాడు.

ఈ రిపోర్టు వ్యవహారంలో చోప్రాది పైపై అజమాయిషీయే అయినా, పూర్తి లెగ్ వర్క్ చేసింది శివకుమారే. ఆ సమయంలో మరొక స్టాఫ్ రిపోర్టర్ దిలీప్ సెలవుమీద వున్నాడు. శివకుమార్ కు ఈ వ్యవహారంలో ప్రతి చిన్న అంశం క్షుణ్ణంగా తెలుసు. కౌషిక్ మనుషుల్ని వాళ్ళతో పరిచయాన్ని, వాళ్ళ నెలవుల్ని అతను స్వయంగా దర్శించాడు. అదే ఇప్పుడు కౌషిక్ కి తెలిసిపోయింది—తత్ఫలితమే శివకుమార్ హత్య. శివకుమార్ ని సమూలంగా అంతమొందించడమేగాక, తనకి ముప్పు తెచ్చే సాక్ష్యాధారాలైన అపత్రాల్ని సంగ్రహించాడు.

బాస్ ఈ దురాగతాన్ని ఎంత తీవ్రంగా పరిగణిస్తాడో నాకు తెలుసు. పత్రికా వ్యవహారాల్లో

శోక్యం—విలేఖరి హత్య—ఇవి రెండూ ప్రజల్లో ఎంత ఆగ్రహావేశాలు సృష్టిస్తాయో చెప్పనవసరంలేదు.

ఇప్పుడు బాస్ నన్ను ఢిల్లీ పంపుతున్నాడు. ఆయన ఒక కార్య భారాన్ని మా భుజస్కంధాల పై వేశాడంటే, తానాశించిన ఫలితాన్ని మేం ఇచ్చి తీరాల్సిందే!

నేను ఇంటికొచ్చాక నీరజ ఫోన్ చేసి టికెట్ బుక్ చేసినట్టూ, నేను వెళ్ళి బుకింగ్ తీసుకోవచ్చనీ చెప్పింది.

శ్యామల పెద్ద సూట్ కేసు తీయబోతోంటే తిట్టి, చిన్న బ్రీఫ్ కేసులో సామాను సర్దుకున్నాను. ఫ్లయిట్ కి సుమారు గంట టైముంది. అశాంతిగా పచార్లు చేస్తూ కాలం గడుపుతున్నాను. అప్పుడు అకస్మాత్తుగా ఫోను మ్రోగింది....

వెళ్ళి రిసీవరెత్తాను. "మిస్టర్ సుందర్?" అడిగింది అవతలి కంఠం.

"యస్, సుందర్ హియర్" అన్నాను అతనెవరో అర్థంగాక.

"సుందర్, నా హెచ్చరిక పాటించు. ఢిల్లీ వెళ్ళకు!"

కలవరపడ్డాను. "హాలో, ఎవరున్నువ్వు?" అన్నాను తీవ్రంగా.

"నువ్వు ఢిల్లీ వెళ్ళకు సుందర్! చింతిస్తావు."

"ఓ.కే. థాంక్స్" అతనితో కాలం వృధా చేయదల్చుకోలేదు. డిస్కనెక్టు చేసి బాస్ ఇంటికి ఫోన్ చేశాను. నీరజ పలికింది.

"నీరజ! నా మాటలు జాగ్రత్త వినండి. శత్రువులు మన మాటలు వింటున్నారు. అక్కడి బాస్ ఇంటిని బగ్గింగ్ చేసి వుంటారు. ఫోన్ని టాప్ చేసి వుంటారు.

వాటిని కనుక్కునేంతవరకూ జాగ్రత్తగా మసలుకోండి. వాటిని తొలగించి రాబర్టుని ఫోన్ చెయ్యమనండి నాకు, క్విక్!"

సరిగ్గా ఏడు నిముషాలకి రాబర్టు ఫోన్ చేశాడు.

"సుందర్, మీరన్నట్టు ఇక్కడ నిజంగానే బగ్గింగ్ చేశారు!"

"తొలగించారా?"

"డిటెక్టర్‌తో వాటిని పీకి చితగ్గొట్టాను!"

"గుడ్! రాత్రి ఆ యువతి అమర్చి వుంటుంది. మన మాటలన్నీ విన్నారు ఉదయం. నా ప్రయాణం సంగతి వాళ్ళకి తెలిసిపోయింది. ఫోన్ చేసి మానుకో అన్నాడు ఇందాక. నన్ను ఏర్‌పోర్టుకి వెంటాడవచ్చు. మీరు వెంటనే కారేసుకొని వస్తారా, నాతో ప్రయాణిస్తే వాళ్ళ లీడ్ దొరుకుతుంది?"

"అలాగే, సుందర్ వెంటనే వస్తాను."

"నాకు రివాల్వర్ అవసరం ఇప్పుడు. కానీ విమానంలో వీలుకాదు. నీరజకు చెప్పండి, చోప్రాకు ఫోన్ చేసి రివాల్వర్‌తో అతన్ని అక్కడ ఏర్‌పోర్టు దగ్గర వుండమని!"

"అలాగే, సుందర్. కానీ ఇక్కడ మీ మిసెస్‌ని.... ఒంటరిగా...."

"బందోబస్తు చేద్దాం!" అని ఫోన్ పెట్టేశాను.

"ఎవరికి బందోబస్తు చేస్తున్నారు?" వచ్చి అడిగింది శ్యామల.

"శ్యామలాదేవికి, సోమసుందర్ అర్ధాంగి....."

"ఏం చేసిందామె?"

"శాంతిభద్రతలకి ముప్పుగా ప్రవర్తించింది."

ఆమెని పట్టి గాఢంగా చుంబించి వదిలాను.

సరిగ్గా పన్నెండు నిముషాల్లో రాబర్టు ఇంట్లోకొచ్చి వాలాడు.

"ఓ.కే?" అన్నాను.

"ఓ.కే!" రాబర్టు అన్నాడు, "ఇక్కడ నా మనుషుల్ని పెట్టించనా?"

"ఇక్కడ మనుషులెందుకు?" అడిగింది శ్యామల.

"నీకు రక్షణగా, పరిస్థితి బాగాలేదు" అన్నాను.

"అయితే నేనిక్కడ వుండను!" అందామె చటుక్కున.

"మీ తాత దగ్గరికి వెళ్ళిపోతావా?"

తలూపిందామె వెంటనే.

"గుడ్ రాబర్టు, ఆమె ప్రయాణం చూడండి!"

"అలాగే! కమాన్ సిస్టర్, హారియప్! బట్టలు సర్దుకోండి!"

ఆమె కంగారుగా పరుగెత్తింది.

పదినిముషాల్లో మేం బయటకొచ్చి ఇంటికి తాళం వేశాం. కారెక్కి కూర్చున్నాం.

రాబర్టు స్టార్టు చేశాడు. నేనతనిప్రక్కన కూర్చున్నాను. శ్యామల వెనుక సీట్లో కూర్చుంది. రాబర్టు తాపీగా డ్రైవ్ చేస్తున్నాడు, డ్రైవింగ్ మిర్రర్‌లో అప్పుడప్పుడు దృష్టి నిలుపుతూ. వెనుక చాలా వాహనాలున్నాయి. కానీ ఏదీ అనుమానాస్పదంగా లేదు. వెంటాడే శాల్తీని (అది మనిషయినా, వాహనమయినా) అతను ఇట్టే పసిగట్టేస్తాడు, దాని గమనాన్నిబట్టి. ఇప్పుడెవరూ వెంటాడ్డంలేదని తేల్చేశాడు. అయితే ఏర్‌పోర్టులో వేచి వుండొచ్చు, నా ఆగమనం కోసం.

పార్కింగ్ ప్లేస్‌లో కారు దిగి, కంటి చివరలనుండి చుట్టూ దృష్టిని సారిస్తూ, రిసెప్షన్ లాంజ్‌లోకి అడుగు పెట్టాం. హడావుడిగా వుంది. ఎవరు ప్రత్యర్థో పోల్చుకోలేక పోయాం ఆ జన సందోహంలో. స్పీకర్‌లో అనౌన్స్‌మెంట్ ఇంతలో: ఢిల్లీ ఫ్లయిట్ ప్రయాణానికి సిద్ధం! కంగారుగా బుక్కింగ్‌ని సమీపించాను. పేరు చెప్పి ఎనిమిదివందల చిల్లర నగదు చెల్లించి, టిక్కెట్ తీసుకున్నాను—హడావుడిగా సెక్యూరిటీ చెకప్ ముగించుకుంటుంటే రాబర్టు వచ్చి చెవిలో వూదాడు చిన్నగా.

"సారీ, మన ఫ్రెండ్స్ ఎవరూ లేరిక్కడ. అక్కడ హంతకుడికి వార్త అందించి వుంటారు, మీ కోసం అక్కడ కాచుకునుంటాడు. ఏర్‌పోర్టు దగ్గర."

సాలోచనగా తలూపాను.

"మీరక్కడ జాగ్రత్త!" అన్నాడు రాబర్టు మళ్ళీ.

"ఒకవేళ ఈ ఫ్లయిట్‌లోనే ఎదురు చూస్తున్నాడేమో?"

రాబర్టు ఉలిక్కిపడ్డాడు, "పాసిబుల్."

శ్యామల చటుక్కున నా చెయ్యి పట్టుకుంది. ఆమె కళ్ళనిండా భయం!

"డోంట్ వర్రీ. క్షేమంగానే వస్తాను. వచ్చాక నీకు ఫోన్ చేస్తాను, నిశ్చింతగా నువ్వు మీ వూరెళ్ళిపో!"

ఆమె చేతిని నిమురుతూ తప్పించి, చటుక్కున కదిలి పోయాను.

6

పాలెం విమానాశ్రయం రిసెప్షన్ లాంజ్‌లో నన్ను చూసి వాళ్ళిద్దరు వేగంగా సమీపించారు: చోప్రా, దిలీప్‌లు. షేక్‌హాండ్స్ ఇచ్చాను. చోప్రా వయసు

యాభై వుంటుంది, దిలీప్‌కి ముప్పై. ఇద్దరి ముఖాల్లో విషాదం గోచరిస్తోంది. హుందావుడిగా నన్ను తీసుకొని బయటకు వెళ్ళి కారెక్కించారు.

"సుందర్, ఈ రివాల్వర్ వుంచండి" అన్నాడు చోప్రా.

దాన్ని తీసుకుని జేబులో తోశాను. దిలీప్ కారు స్టార్టుచేశాడు. "మిస్టర్ చోప్రా, హంతకుడు మనల్ని కనిపెడుతూండాలి. నాకు హెచ్చరిక అందింది" అన్నాను.

"కనిపెట్టనివ్వండి! వాడెవడో తెలిస్తే, పోల్చుకుంటే, ఇదుగో ఈ రివాల్వర్ తీసి కాల్చేస్తాను అక్కడికక్కడే!"

నవ్వాను. "అతన్ని చంపమనికాదు ఆదేశం, మిస్టర్ చోప్రా. పట్టుకొని కన్‌ఫెషన్ కక్కించమని. కాపీకొని కటకటాల వెనక్కి పంపించమని!"

చోప్రా తలూపాడు. "నాకు తెలుసు, సుందర్."

"కుమార్ చావు మిమ్మల్ని బాధిస్తూండాలి."

"ఎవరిని బాధించదు? ఆ పూర్ ఫెలో తన విధేయతను ప్రకటించుకోవడానికి ఎంత తాపత్రయపడేవాడు! నన్ను గురువుగా పూజించేవాడు."

"అతని తల్లికి టెలిగ్రాం పంపారా?"

"పంపాను. పూర్ మదర్ .... ఈ శోకం తీరేదికాదు, సుందర్."

పది నిముషాలు నిశ్శబ్దంగా ప్రయాణించాం. కారు ఇప్పుడు క్రెసెంట్ రోడ్‌లో వురుకుతోంది.... ట్రాఫిక్ ఎక్కువ లేదు, ఇరు ప్రక్కలా షాపుల్లో జనసందోహంగా వుంది కానీ. దిలీప్ ఓ కన్ను డ్రైవింగ్ మిర్రర్

మీద వుంచి నడుపుతున్నాడు. అక్కడక్కడా అకస్మాత్తుగా వేగం తగ్గిస్తూ, అనుమానం తీర్చుకుంటూ, చకచకా డ్రైవ్ చేసుకు పోతున్నాడు. అనేకసార్లు వెనక్కి చూసిన నాకూ ఏ వాహనమూ అనుమానాస్పదంగా తోచలేదు. మా వెనుక కారులోనే ఓ సరదా పురుషుడైన సర్దార్జీ కుటుంబ సమేతంగా ఎక్కడికో ప్రయాణమయ్యాడు. అతని కారులో నిండుగా తలలుండటంవలన ఆ వెనుక వాహనాల సంగతి తెలీడం లేదు.

దానికి తోడుగా, ముందు సీట్లో ఐస్‌క్రీమ్ తింటోన్న ఆంబులెన్స్ సైజు సర్దార్జీ భార్య ఉండుండి ఫెళ్ళున క్లోజప్‌లో భీకరంగా నవ్వుతోంటే, కళ్ళు గుర్రొప్పడిచి వెనక చూసే సాహసం కలగటంలేదు.

దాదాపు సగం ప్రయాణమంతా ఆమె అలాగే రాజ్యమేలుతూ వచ్చింది.

కన్నాట్ సర్కస్ దాటి జనపథ్‌లోని ఆఫీస్ కాంప్లెక్స్ చేరేవరకూ మమ్మల్ని ఎవరైనా వెంటాడారో లేదో ఇదమిద్ధంగా తేల్చుకోలేక పోయాం.

"వెల్, లెటజ్ ఫర్గెట్" అన్నాడు చోప్రా.

ముగ్గురమూ కారుదిగి బిల్డింగ్‌లోకి నడిచాం. లిఫ్ట్‌లో తొమ్మిదో అంతస్తులోని మా ఆఫీసు గదికి చేరుకున్నాం. దిలీప్ తాళంతీసి ఆహ్వానించాడు.

లోపలికెళ్ళి చుట్టూ చూశాను. చోప్రా తన స్థానంలో కూర్చుంటూ మమ్మల్ని కూర్చోమన్నాడు. మేమిద్దరం అతనికి ఎదురుగా కూర్చున్నాం.

"జరిగిన ఘటనకి బాస్ మా మీద ఆగ్రహం చెందారనుకుంటాను" అన్నాడతను.

"లేదు, మామీద ఆగ్రహించలేదు. దుర్ఘటన అక్కడా జరిగింది."

"అక్కడ డాసియర్ ఎలా పోయింది?"

క్లుప్తంగా వివరించాను. అతను నిట్టూర్చాడు. "క్లాసిక్ పకడ్బందీగా జరిపించాడు.... రాత్రి ఆఫీసులోకి ప్రవేశించి డూప్లికేట్ కాపీ తస్కరించారు."

"కుమార్ ని ఎలా షూట్ చేశారు?"

"తెలీదు, ఎవరూ చూడలేదు. కానీ హత్య అతని ఫ్లాట్ లోనే జరిగింది. షాట్ ప్రక్క ఫ్లాట్స్ లో ఎవరికీ విన్పించలేదు. సైలెన్సర్ అమర్చివుండాలి. కంఠంలోకి షూట్ చేశాడు. రాత్రి ఒకటీ—రెండు గంటల మధ్య జరిగుండాలని పోలీసులు...."

"ఆ సమయంలో హంతకుడి రాకపోకలు ఎవరూ చూడలేదా, జానిటర్ కూడా?"

"ఎవరూ చూడలేదు. జానిటర్ లేడు, అదొక థర్డ్ గ్రేడ్ అపార్టుమెంట్."

హఠాత్తుగా ఫోన్ మ్రోగడంతో చోప్రా ఎత్తి, విని, నా కందించాడు!

"మిస్టర్ సుందర్?" అంది అవతలి గొంతు.

నిటారుగా కూర్చున్నాను. "యస్, నువ్వెవరు?"

"సుందర్, నువ్వెంటనే వెళ్ళిపో! ఇక్కడి నీళ్ళు పడవు."

"తమరి నామధేయం?"

"నువ్వెంటనే వెళ్ళిపో, సుందర్! ఇక్కడి నీళ్ళు నీకు పడవు!"

"అలాగే, ఆలోచిస్తాను" ఫోన్ పెట్టేసి చోప్రా వైపు తిరిగాను, "ఇది కొత్త గొంతు. హైద్రాబాదులో

విన్నది కాదు. కనుక నన్నెవరూ వెంటాడి రాలేదు. ఇక్కడ వాళ్ళ మనిషికి నా రాక సమాచారం అందింది. ఇతను కూడా తెలుగులో బెదిరించాడు. కౌషిక్ మనుషుల్లో తెలుగువాళ్ళున్నారా?"

"తెలుగువాళ్ళా.... లేరు. అతని మనుషుల్లో తెలుగు వాళ్ళుగానీ, ఆ భాష వచ్చినవాళ్ళుగానీ లేరు. అంతా నార్త్ ఇండియన్స్. వాళ్ళెవరూ ఆయుధాలు ధరించిగానీ, దొమ్మీల్లో పాల్గొనిగానీ. లేరు—ఒక్క బిల్లూ తప్ప."

"అత నెవరు?"

"కౌషిక్ బాడీగార్డు, మహా కిరాతకుడు."

"అలాగా .... అయితే ఈ సుమిత్ర ఎవరు? హైద్రాబాదులో నన్ను బెదిరించిందెవరు? ఇప్పుడు హెచ్చరించిన మనిషెవరు? వీళ్ళంతా తెలుగువాళ్ళే..."

"సింపుల్! కౌషిక్ హైద్రాబాదులో ఏదో ముఠా సహాయం కోరివుంటాడు, అక్కడి డాసియర్ని తస్కరించడానికి. అక్కడ మీకు తెలిసిన ముఠాలు లేవా?"

"ఇంతగా తెగించగల ముఠా....ఓహ్, వుంది!"

"ఏది?"

"మొకాసిన్ గ్యాంగ్!"

"మొకాసిన్ గ్యాంగ్?"

"అవును, వాళ్ళు హైద్రాబాద్ హెడ్క్వార్టర్స్గా దేశవ్యాప్తంగా ఆపరేట్ చేస్తున్నారు .... ఇది వీళ్ళ పనే!"

కిటికీ అద్దం చిటుక్కున విచ్చుకొని, నా చెవి ప్రక్క నుంచి తుమ్మెదలా ఝుంకారం చేస్తూ వెళ్ళి బుల్లెట్, ఎదురుగోడకున్న కేలెండర్లోకి చొచ్చుకుపోయింది. కాగితాలు కాలి చిన్నగా పొగ వచ్చింది!

మేం తటాలున ప్రక్కకు దూకేశాం నేలమీద. మరో బుల్లెట్ రాలేదు. చోప్రా కిటికీ దగ్గరకు దూకి అవతలకి చూశాడు. మరుక్షణం అరుస్తూ పరుగుతీశాడు, "కమాన్! ఎదురు బిల్డింగ్ లోకి!"

మేం కూడా లేచి పరుగుతీశాం. కారిడార్ లోకురికి లిఫ్ట్ లో దూరం. కిందకు చేరుకొని రోడ్డుమీద పరిగెత్తాం. ట్రాఫిక్ కి భయపడకుండా చాకచక్యంగా తప్పించుకొని రోడ్డవతల పడ్డాం. బిల్డింగ్ లోకి జొరబడి రిసెప్షన్ దగ్గర ఆగాం. అప్పుడే ఎదురయ్యాడు మాకు—బ్రౌన్ కలర్ జీన్స్ లో వున్న ఒక నల్లటి యువకుడు. మమ్మల్ని చూస్తూనే మాకంటే ముందు రియాక్ట్ అయి, మెరుపు వేగంతో మూడు దెబ్బలు మాకు వడ్డించి క్షణకాలంలో అదృశ్యమయ్యాడు.

నేనూ దిలీప్ తత్తరబోయి తేరుకునేంతలో చోప్రా అరుచుకుంటూ బయటకు పరుగుతీశాడు. మేం అతని వెనుక ఉరికాం, రివాల్వర్ పట్టుకొని. అప్పుడే రోడ్డువారగా ఆగివున్న ఒక పాత పసుపురంగు ఫియట్ కారు స్టార్టయి దూసుకుపోతోంది. చోప్రా ఆగిపోయి గురిచూసి దాని దిశలో కాల్చాడు. పెద్ద ప్రేలుడు సంభవించి హాహాకారాలు చెలరేగాయి. జనం పిచ్చిగా పారిపోతున్నారు. ఆ కారు ఇంకా వేగం పెరిగి క్షణంలో కనుమరుగైంది—దిలీప్ వెనుదిరిగి బిల్డింగ్ లోకి పరుగుతీశాడు. చోప్రా మరోసారి వెర్రి ఆవేశంతో కాల్చబోతే రివాల్వర్ లాక్కుని వారించాను. "తెలివిలోకి రండి! పబ్లిక్ మర్డర్ చేస్తారు!"

ట్రాఫిక్ పోలీసులువచ్చి అతన్ని చుట్టుముట్టారు. నేను నెమ్మదిగా జారుకొని బిల్డింగ్ లోకి వెళ్ళిపోయాను.

రిసెప్షన్‌లో దిలీప్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మధ్య కాసేపు ఆగడంతో, "ఎవరికి ఫోన్?" అన్నాను.

"లైసెన్సింగ్ అథారిటీకి! ఆ కారు నెంబర్ నేను చూశాను——" అన్నాడతను. తర్వాత అవతలి మాటలు విని థాంక్స్ చెప్పి సీవర్ పెట్టేశాడు.

"లెటజ్ గో! భారత్ గ్యారేజికి, షాదారాలో!"

మేం బయటికి వచ్చేసరికి చోప్రా పోలీసుల్ని వదిలించుకుని దిక్కులు చూస్తున్నాడు. జనం ఇంకా అతన్ని సమీపించడానికి జంకుతున్నారు. దిలీప్ అతనికి విషయం చెప్పాడు. తిరిగి మేం రోడ్డుమీదనుంచి మా ఆఫీసు కాంప్లెక్స్‌లో కరికి కారెక్కాం. శరవేగంతో షాదారా వైపు దూసుకుపోయాం.

'భారత్ గ్యారేజి' షాదారాలోని పాత లోకాలిటీలో వుంది. మేం కారు దిగిన వెంటనే నల్గురు గ్యారేజి వర్రాళ్ళు వేగంగా చుట్టుముట్టి కారుని పరీక్షించడం మొదలుపెట్టారు. ప్రొప్రయిటర్ నవ్వుతూ బయటికొచ్చి మాతో కరచాలనం చేశాడు. చోప్రా విషయం చెప్పేసరికి అతని ముఖం బిగుసుకుపోయింది.

"కమాన్! ఆ కారెవరిది?" రెట్టించాడు చోప్రా.

"మాదే——కానీ మీరెవరు?"

"ఆ కారెక్కడ వుంది? కమాన్!"

"అద్దెకు పోయింది, కానీ మీరు...."

"ఎవరికిచ్చారు? ఎప్పుడు?"

"ఈ ఉదయం. అతను ప్రెసిడెంట్ లాడ్జి అడ్రసు ఇచ్చాడు, చాందినీచౌక్‌లో. అతని పేరు ప్రకాష్."

"చూడండూ, ఇది ఖూనీకేసు" చోప్రా అన్నాడు హెచ్చరిస్తూ, "ప్రకాష్ మాకు కావాలి. ట్రిక్స్ చేశా

వంటే జైల్లో వుంటావు. ఫోన్ చేసి ప్రకాష్‌ని హెచ్చరించేవు, జాగ్రత్త!" దిలీప్ వైపు తిరిగి అన్నాడు మళ్ళీ, "నువిక్కడే వుండు. ఇతను ఎవరికీ ఫోన్ చెయ్యకుండా చూడు. ప్రకాష్ వస్తే ఏదో మిషతో నిర్బంధిస్తాడు ఈ సచ్చాసింగ్. మేం అరగంటలో తిరిగి వస్తాం, ఏం సచ్చాసింగ్?"

"నా పేరు సచ్చాసింగ్ కాదు."

"కానీ నువ్వు సత్యమే పలకాలి!" అన్నాడు చోప్రా కారు దగ్గరికి నడుస్తూ, "కమాన్, సుందర్, ప్రెసిడెంట్ లాడ్జ్!"

ప్రెసిడెంట్ లాడ్జి చాందినీచౌక్‌లోని ఒక ఇరుకు ఏరియాలో వుంది. సిక్లాస్ లాడ్జి, ఆవరణలో కారు దిగి ఆతృతగా చూశాం అక్కడ ఆగివున్న కార్లని. చోప్రా నా వీపు తడుతూ రెండు అంబాసిడర్ కార్ల మధ్య ఫియట్ కారుని చూపాడు. పసుపు రంగులో వుంది, దిలీప్ చెప్పిన నెంబర్‌తో.

"కమాన్, మన ఫ్రెండ్ ఇక్కడే వున్నాడు!" చోప్రా లోపలికి దారితీశాడు. నేను వెంబడించాను కంగారుగా.

చోప్రా కౌంటర్ దగ్గర ఆగి, "ప్రకాష్!" అన్నాడు.

"ఏ ప్రకాష్?" అడిగాడు కౌంటర్‌లోని వ్యక్తి.

"ఎందరు ప్రకాష్‌లున్నారు మీ కొంపలో?"

"ఒక్కడే!"

"అతడే!"

"రూం 24, ఉన్నాడు పోండి!"

చకచకా మెట్లెక్కి అయిదో అంతస్తులోకి చేరుకున్నాం. నడవలోకి నడిచి ఆ నెంబర్ గదిముందాగాం.

లోపల ఫ్యాను తిరుగుతోన్న చప్పుడవుతోంది. మరే అలికిడీ లేదు. చోప్రా కీ హోల్ లోంచి చూసి, చిటికె వేస్తూ చటుక్కున దూరంగా కదిలి వెళ్ళిపోయాడు. అతని వెనుక నేనూ వెళ్ళాను. ఇంతలో ఆరవ అంతస్తు నుంచి దిగుతూ కన్పించాడు రూం బాయ్.

"స్సో, చత్తారాం, కాస్త ఆగు" పిలిచాడు చోప్రా, అతన్ని సమీపిస్తూ.

అతను ఆగి చూశాడు, "నా పేరు సియారాం, సాబ్."

"చూడు సియారాం, 24లో కస్టమర్ లేడా?"

"ఉన్నాడు సాబ్."

"మరి పలకడేమిటి?"

"పిలవమంటారా, సాబ్?"

"నువ్వు పిలువ్, కానీ మేం వచ్చినట్టు చెప్పకు."

"మీరెవరు సాబ్?"

"అనవసరం! అర్థమైందా? ఈ నోటు నీది!"

రూం బాయ్ పదిరూపాయలనోటు కళ్ళజూడటంతో బుల్ డాగ్ అయిపోయాడు. విశ్వాసంతో ముందుకు నడిచి, ఛాతీ విరుచుకొని 24 బెల్ నొక్కాడు. మేం ఎడమవైపు గోడకానుకుని నిలబడ్డాం. బాయ్ మళ్ళీ నొక్కి పిల్చాడు, "సాబ్, తలుపు తీయండి. గది ఊడ్వాలి."

"పొద్దున్నే కదా ఊడ్చావు?" అంది లోపలి గొంతు.

"రెండు పూటలా ఊడుస్తాం సాబ్, మా సేఠ్ పెట్టే తిండితో సమానంగా."

చటుక్కున హేండిల్ తిరిగి తలుపు రెక్క సగం తెరుచుకుంది. ఒక యువకుడి తల బయటికొచ్చింది.

"మరి చీపురేది, బద్మాష్?" అన్నాడతను చీదరింపుగా.

"ఇక్కడ వుంది!" చోప్రా గభాల్న తలుపుని తీసి, పిడికిలితో అతని ముఖాన్ని బద్దలు చేస్తూ గదిలో వెల్లకిలా పడేసి జొరబడ్డాడు.

నేను తటాలున దూకి ఆ యువకుడి జేబులు తడిమి రివాల్వర్ తీసేసుకున్నాను. సైలెన్సర్ అమర్చిన రివాల్వర్. అతను తేరుకొని బిత్తర చూపులు చూస్తున్నాడు.

చోప్రా రెండంగల్లో అతన్ని సమీపించి మెడపట్టి లేపి దవడకింద కొట్టాడు, "కన్ఫెషన్!"

"ఎవరు మీరు!" అరిచాడా యువకుడు ఉక్కిరి బిక్కిరవుతూ.

"నీకు తెలుసు!" చోప్రా పిడికిలి అతని ముఖంమీద చోటు చేసుకుంది, "కమాన్, కన్ఫెషన్!"

ఆ యువకుడు బాధ తట్టుకోలేక కేక పెట్టాడు. అది మూసి రూం బాయ్ పారిపోయాడు. వెంటనే తలుపు మూశాను.

చోప్రా ఆవేశంతో ఆ యువకుడి మెడపట్టి బెడ్ మీదకు తోశాడు. ఒక్క అంగలో వెళ్ళి, అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి, పట్టి లాగుతూ తల పైకెత్తాడు. "చెప్పు! నువ్వెవరి మనిషివి?"

"నా పేరు—ప్రకాష్."

"ఎవరి మనిషివి?"

"నే నెవర్నీ చంపలేదు."

"రాత్రి మా మనిషిని చంపావు. ఇందాక మామీద హత్యా ప్రయత్నం చేశావు."

"నే నేమీ చేయలేదు."

చోప్రా అతని చెంప ఛెళ్ళుమనిపించాడు.

"నువ్విక తప్పించుకోలేవు, ఫూల్! నిన్నెవరు పంపారు చెప్పు!"

"నేనే వచ్చాను!"

"కాషిక్ పంపాడా?"

"నేనే వచ్చాను!"

"మొకాసిన్ గ్యాంగ్ పంపిందా?"

"నేనే వచ్చాను!"

"నువ్వెలా వచ్చావు, నూవర్ కే బచ్చే!"

చోప్రా అతని మెడవంచి వీపుమీద బాదాడు.

"ఆగండి! నన్ను వదిలేయండి! చెబితే వాళ్ళు నన్ను బ్రతకనివ్వరు."

"ఎవరు వాళ్ళు? నువ్వెవరి తరఫున వచ్చావు?"

"అది—మీరు—నన్ను—"

"సుందర్! కాల్ ది పోలీస్!" చోప్రా అరిచాడు అసహనంగా.

"మీ మనిషిని చంపింది నేనే! కానీ పట్టుబడను—పట్టుబడకూడదు—"

బలాన్నంతా కూడదీసుకుని ఒక్క తోపుతో చోప్రాని దూరంగా నెట్టేశాడు ప్రకాష్-అదే ఊపులో మెరుపులా వెళ్ళి ఎత్తయిన కిటికీ అద్దాన్ని ఢీకొని దాన్ని పగులగొట్టుకుంటూ బయటకు దూసుకుపోయి, క్షణకాలం గాల్లో అలా తేలి, టప్పున రాలిపోయాడు కొబ్బరికాయలా.

క్రింద హఠాత్తుగా కేకలు వెలువడ్డాయి.

7

ఒక పబ్లిక్ కాల్ బూత్ లోకెళ్ళి ఆరంకెల నెంబర్

తిప్పాను. వెంటనే రిసెప్షన్స్ వచ్చింది, "యాస్, మిస్టర్ కౌషిక్స్ రెసిడెన్స్" అంది ఒక ఆడగొంతు.

"కౌషిక్‌ని కలవాలి." అన్నాడు.

"మీ పేరు?"

"సోమసుందర్."

"అపాయింట్ మెంట్ వుందా?"

"అక్కర్లేదు, క్రైమ్ రిపోర్టర్‌నని చెప్పండి, అర్థం చేసుకుంటారు."

"దేనికి?"

"బ్లేడ్ వీక్లీకి."

"జస్ట్ మినిట్...." కొన్ని క్షణాల తర్వాత అందామె, "మీరు వెంటనే రావచ్చు."

"థాంక్యూ వెరీమచ్!" ఫోన్ పెట్టేసి బయట కొచ్చాను.

టాక్సీ ఎక్కి చాణక్యపురి పోనివ్వమన్నాను. అది పరిగెడుతోంటే విశ్రాంతిగా వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను. ఈ ప్రకాష్ చావు వ్యవహారాన్ని పూర్తిగా అప్ సెట్ చేసింది! అతన్నుంచి వాఙ్మూలం రాబట్టలేక పోయాం. అనూహ్యంగా ఆత్మాహుతి చేసుకున్నాడు. దీన్నిబట్టి అతను మొకాసిన్ గ్యాంగ్ మనిషని స్పష్టమవుతోంది.... ఇది వాళ్ళ సాంప్రదాయమే. పట్టుబడితే నోరు మెదపకుండా ఆత్మాహుతి గావించుకుంటారు. గ్యాంగ్ మనుగడని కాపాడుకుంటారు. దానిపట్ల తమ విధేయతని చివరివరకూ నిలుపుకుంటారు.

సరిగ్గా సంవత్సరం క్రితం ఈ గ్యాంగ్ కలాపాలు ప్రారంభమయ్యాయి. దీని నాయకుడెవరో తెలియదు. దీని హెడ్ క్వార్టర్స్ హైద్రాబాద్ అని తెలిసినా ఆ

స్థావరం ఎక్కడో ఇంతవరకు తెలుసుకోలేక పోయారు. దేశవ్యాప్తంగా ఈ గ్యాంగ్ మనుషులు పర్యటిస్తూంటారు, క్లయంట్స్‌నుంచి వివిధ కాంట్రాక్టులు పొంది. దొంగతనాలూ, దోపిడీలూ, రాని బాకీ వసూలు, ప్రత్యర్థుల వళ్ళు మరమ్మత్తూ, ఫోర్జరీలూ, కిడ్నాపింగ్, చివరికి హత్యలవరకూ.... వీళ్ళు చేపడతారు.

తమ ఉనికిని ఎంతో రహస్యంగా కాపాడుకుంటారు. ఎక్కడా ఆధారాలు వదలకుండా జాగ్రత్తపడతారు. ఒకవేళ ఏమరుపాటుగా పట్టుబడితే పోలీసులకు ఎటువంటి సమాచారం ఇచ్చి సహకరించరు. తమ ఆచారం ప్రకారం ఆత్మాహుతి చేసుకుంటారు. అలా ఆత్మాహుతి చేసుకుంటే ఆ చావుకి కారకులైన వారిమీద పగతీర్చుకోకుండా వూరుకోదు గ్యాంగ్. ఈ సంవత్సర కాలంలో ఇలాంటి చావులు మూడు సంభవించాయి హైద్రాబాదులో. అయిదుగురు పోలీసు అధికారులు కాల్చివేయబడ్డారు ప్రతీకార చర్యగా.

ఇప్పుడు ప్రకాష్ చావు.

ప్రతీకారంగా ఎవర్ని చంపుతారు?

ఉలిక్కిపడ్డాను. నన్నా? అవును, వాళ్ళ హెచ్చరిక పెడచెవిని పెట్టి నేనిలా వచ్చాను. పర్యవసానమే ఈ చావు అని భావిస్తారు. కానీ ప్రత్యక్ష కారకుడ్ని నేను కానేమో? ఇది వాళ్ళు ఆలోచిస్తారా? లేక గుడ్డిగా నన్నే అనుకుని లేపేస్తారా? వాళ్ళ తీర్పు ఏమిటో వేచి చూడాలి. అయితే ముందు చోప్రాని హెచ్చరించాలి.

చోప్రా ఆ లాడ్జింగ్‌లో పోలీసులతో వ్యవహారం ముగించుకొని ఆఫీసుకి వెళ్తానన్నాడు. ఫోన్ చేసి గ్యారేజి దగ్గర్నుంచి దిలీప్‌ని రప్పించుకున్నాడు. నేను కాషిక్‌ని

కలుసుకుంటానని అడ్రసు తీసుకొని బయల్దేరాను. పోలీసులకి సంబంధించినంత వరకూ శివకుమార్ హత్యా పరిష్కారమైంది—ప్రకాష్ చావుతో, అతని దగ్గర రివాల్వర్‌తో. కానీ మాకు సంబంధించి ఈ వ్యవహారం ముగియలేదు. అసలు హంతకులు వేరే వున్నారు. వాళ్ళని నిర్మూలించాలి.

టాక్సీ ఆగడంతో తేరుకుని చూశాను. చెప్పిన అడ్రసుకి చేర్చాడు డ్రైవర్. దిగి ఫేర్ చెల్లించి పంపేశాను. ఆ గేటు దగ్గరకి నడిచి గూర్ఖాకి నా పేరు వివరాలూ చెప్పాను. అతను బూత్‌లోకి వెళ్ళి ఫోన్ చేసివచ్చి గేటు తెరిచాడు. తిన్నగా లోపలికి నడిచాను. చుట్టూ ఎత్తయిన కాంపౌండు వుంది. దూరంగా భవంతి కన్పిస్తోంది—పై సగభాగం. క్రింది భాగాన్ని దాని ఎదురుగా పెంచిన దట్టమైన వృక్షాలు కప్పివేశాయి.

సుమారు వంద గజాల బాట నడిచి పోర్టికోలో చేరుకున్నాను. వరండాలో ఓ పంజాబీ యువతి ఎదురు చూస్తోంది. మెల్లెక్కి ఆమె దగ్గరికి వెళ్ళాను. "దిస్ వే ప్లీజ్...." అందామె దారి చూపిస్తూ.

ఆమె వెంట నడిచి హాల్లోకి వెళ్ళాను. అక్కడెవరూ లేరు. ఆమె నన్ను పడిప్రక్క గదిలో ప్రవేశపెట్టి, పేరు ప్రకటించి నిష్క్రమించింది....

గది చల్లగా, అడుగువేస్తే మోకాలివరకూ కూరుకుపోయే కార్పెట్స్‌తో, ఖరీదయిన ఫర్నిచర్‌తో పరమ ఆర్భాటంగా అలంకరించివుంది.

తలుపుకి సరిగ్గా ఎదురుగా, కిటికీ దగ్గర విశాలమైన టేబిల్ వుంది. దానిచుట్టూ నాలుగు ఫోమ్ కుర్చీలూ, దానిమీద మూడు టెలిఫోన్స్, చెల్లాచెదురుగా ఫైళ్ళూ

కాగితాలూ వున్నాయి.

ఆ టేబిల్ వెనుక విగ్రహంలా కూర్చునున్నాడు, నాకాక్కావల్సిన మనిషి. అతనికి సుమారు అరవై ఏళ్ళుంటాయి. తెల్లగా, లావుగా, దట్టమైన తల వెంట్రు కలతో, చురుకైన కళ్ళతో ఉత్సాహంగా కన్పించాడు. నోట్లో పైప్ కాల్తోంది.

"మిస్టర్ సుందర్? కమాన్, సిట్ హియర్" అన్నాడతను నవ్వుతూ.

వెళ్ళి కూర్చున్నాను. షేక్ హాండ్ ఇవ్వలేదు.

"ఏమిటి విషయం, మిస్టర్ సుందర్?" అన్నాడతను మళ్ళీ, ఆసక్తిగా.

"మిస్టర్ కౌశిక్, మీరా రిపోర్ట్సుని తస్కరించి మీ శ్రేయస్సుని కాపాడనుకున్నారనుకోండి. మీరిప్పుడు ఆయా స్థలాల్లో ఆధారాలు తొలగించినా, మీ దొంగ నిల్వల గోడవున్స్‌ని మార్చివేసినా, మీ బోగస్ రిక్రూ టింగ్ సంస్థని ఎత్తివేసినా, మీ డోప్ రాకెట్ని తాత్కాలికంగా నిలుపుదల చేసినా, వీటన్నింటికంటే చాలా పెద్ద నేరంలో చిక్కుకోవడానికి సిద్ధంగా వున్నారు మీరిప్పుడు."

"మిస్టర్, నువ్వు చాలా చెప్పేస్తున్నావు. అవన్నీ నాకున్నాయా?"

"ఉన్నాయి, మిస్టర్ కౌశిక్. కానీ మా దగ్గర ఆధారాలే పోయాయి. ఫరవాలేదు, ఇప్పుడు నీమీద హత్యకు సంబంధించిన సాక్ష్యాల్ని సేకరిస్తున్నాం. వీలయితే నీ బిజినెస్ బండారం కూడా వెల్లడిచేయగలం- హైద్రాబాదులో తస్కరించిన నీ డాసియర్ ఇంకా ఆ గ్యాంగ్ దగ్గరే వుందనుకుంటాను. ఆ గ్యాంగ్ ని

ధ్వంసం చేసి మా రిపోర్టర్ హత్యలో నీ హస్తాన్ని నిరూపించి పగ తీర్చుకుంటాం!"

అతను చటుక్కున పైప్ పెట్టేసి బెల్ నొక్కాడు. వెంటనే వెనుక తలుపు తెరుచుకున్న చప్పుడైంది. నిశ్శబ్దంగా కదిలివచ్చి ఒక ఆకారం నా ప్రక్కగా నిల్చుంది.

"బిల్లూ, టేకలుక్!" అన్నాడు కౌషిక్.

బిల్లూ నన్ను ఆపాదమస్తకమూ చూశాడు, పిల్లి కళ్ళతో. నేనూ చూశాను అతన్ని తీక్షణంగా. తలమీద జుట్టు ఎంత అందంగా దువ్వుకున్నాడో; ముఖం అంత జిడ్డుగా, క్రూరంగా పెట్టుకున్నాడు. కుడిచేతిలో ఎందుకో ఒక పల్చని ఏడంగుళాల స్టీలు కత్తెర పట్టుకున్నాడు. దాన్ని చూపుడు వేలుతో పెట్టి గుండ్రంగా తిప్పుతూ, ఓ వెకిలి నవ్వు పారేసి పరీక్ష పూర్తి చేసుకొని వెళ్ళిపోయాడు.

"ఏం చేస్తాడు?" అన్నాను కౌషిక్ వైపు తిరిగి.

"నిన్ను గుర్తుపెట్టుకుంటాడు" అన్నాడు కౌషిక్.

"ఎంత ప్రేమ! నన్ను గుర్తుపెట్టుకునే వాళ్ళని గౌరవిస్తాను" అన్నాను సిగరెట్ అంటించుకుంటూ. "కానీ ఆ చేతిలో కత్తెర ఎందుకు?"

"కడుపు చీల్చి పేగులు కత్తిరిస్తాడు."

"నయం. క్షవరం చేస్తాడనుకున్నాను" అన్నాను పొగ లాగి వదులుతూ. "ఆ థగ్ నన్ను హడలగొడ్తాడనుకుంటున్నావా, మిస్టర్? నా సైలెన్సర్ రివాల్వర్ లాగి వాడి గట్స్‌లోకి ఒక బుల్లెట్ దింపానంటే ఎవరికీ చెప్పకుండా స్వర్గానికెగిరిపోతాడు."

"ఐసీ...."

"అప్పుడే ఏం చూశావు? నువ్వు నియోగించిన ముఠా మనిషి చచ్చాడు ఈ రోజు. అది తెలిసి వాళ్ళు మా మీద పగ బట్టారు, చంపడానికి బయల్దేరతారు. అప్పుడు చూడు మా చివరి ఎత్తుగడ! ఆ ముఠాకు ముఠా అంతా మా చేతిలో చిక్కుకొని కోరస్ పాడతారు, కచేరి జరిపిస్తాం. నేరాలన్నీ పలికించి హత్యను నీ మెడకి చుట్ట బెడతాం, తెలుసుకో!"

హేళనగా నవ్వాడతను. "యూ ఆరే ఫూల్! వాళ్ళంతా పిరికివాళ్ళు కారు. క్లయంట్స్ విశ్వాసాన్ని వమ్ము చేయరు. వాళ్ళ రహస్యాల్ని, క్షేమాన్ని, ప్రయోజనాల్ని సురక్షితంగా కాపాడతారు. వాళ్ళనుంచి మీరేమీ పలికించలేరు, పోలీసులు కూడా! వాళ్ళ మౌన వ్రతాన్ని చెడగొట్టలేరు. చిత్రహింసలు పెడితే వీరో చితంగా ఆత్మార్పణం చేసుకుంటారు. అసలిదంతా మీకు వాళ్ళు చిక్కినప్పటి సంగతి! ఒక అమెచూర్ ముఠాకు పత్రిక నడుపుతున్నే ఒక ఆకతాయి మేళానికి అది సాధ్య పడని పని! ఎప్పుడూ అందని చందమామకోసం పోరే చంటిపాపాయి మీ బాస్!"

"నువ్వు అందని చందమామవా?" గట్టిగా నవ్వేసి బయటికొచ్చాను.

ఆ జిడ్డు మొఖం హాల్లో ఎక్కడా కన్పించలేదు. వేగంగా నడిచి వరండాలోకొచ్చాను. అక్కడా లేడు. ఎక్కడో, ఏవో ఏర్పాట్లు చేస్తూంటాడు. నా జేబులో రివాల్వర్ వుంది. కత్తెర వాడి ఆయుధమైతే దాని ఉపయోగమేమిటో తెలియచెప్తాను.

మెట్లు దిగి పోర్టికోలోగుండా ఆవరణలోకి నడిచాను. అలా ఇరవై గజాలు వెళ్ళానో లేదో, వెనుక వేగంగా

అడుగులు వినిపించాయి. తిరిగిచూసేందుకన్నా సమయం మించిపోయింది. నా మెడని బలమైన హస్తం చుట్టి వేసింది. శ్వాసనాళం బిగుసుకుపోయింది. ఉక్కిరి బిక్కిరవుతూ పెనుగులాడాను. అతను నా కుడిచెయ్యి జేబులోకి వెళ్ళకుండా వెనక్కి విరిచి పట్టుకొని, ఎడమచేతిని నా మెడచుట్టూ తిప్పి ఒక్కలాగు లాగాడు. ఎముకలు పెద్దగా శబ్దం చేసి బాధతో అరిచాను. అతడికి నాకంటే ఎక్కువ బలం వుంది. అప్పుడతను వెనక్కివంచి వెల్లకిలా పడేసే ప్రయత్నం చేశాడు — నేనదుపులోకొచ్చి ప్రతిఘటించాను. అప్పుడు గ్రహించాను, నా కాళ్ళు స్వేచ్ఛగానే వున్నాయి. వెంటనే నేను కుడికాలు వెనక్కి జాడించి అతని మోకాలిమీద బలంగా తన్నాను. బూటు తాకిడికి మోకాలి చిప్ప అదిరి, కెవ్వున అరుస్తూ నన్ను వదిలేశాడు. నేను ఊపిరి కూడా తీసుకోకుండా అతనిమీదకు దూకబోయాను—కానీ తళుక్కున అతని చేతిలో కత్తెర మెరవడంతో వెనక్కి తగ్గి, మళ్ళీ తెగించి ముందుకు దూకి అతని రెండు కాళ్ళ మధ్య తన్నబోయాను; చచ్చేవాడే; ప్రక్కకు జరగడంతో ఆ దెబ్బ తొడమీదపడి అతన్ని పడగొట్టింది. కత్తెర వెళ్ళి దూరంగా పడింది.

నేను గబుక్కున దగ్గరికెళ్ళి అతని నెత్తిమీద రెండు దెబ్బలు తీశాను. కళ్ళుమూతపడి తలవాల్చేశాడు.

ఆయాసం తీర్చుకుంటూ చెమట తుడుచుకున్నాను. అప్పుడు చూశాను బిల్డింగ్ కేసి, వాళ్ళిద్దరు చూస్తున్నారు నోళ్లు తెరిచిపెట్టేసి: బాల్కనీలో క్రాపిక్, పోర్టికోలో పంజాబీ యువతి.

నేలమీదకు చూశాను. అతడలాగే పడివున్నాడు

మట్టిలో. దూరంగా కత్తెర కనిపించింది. దాన్నందుకొని అతని అందమైన క్రాపును కత్తిరించ నారంభించాను. అస్తవ్యస్తంగా కత్తిరించి వదిలాను. వెంట్రుకల్ని పోగుచేసి అతని జేబులో తోశాను. లేచి నిలబడి వాళ్ళిద్దరి. చెయ్యూపి గబగబా నడిచాను.

గేటు దగ్గర గూర్ఖా వుంటాడు. కౌశిక్ అతన్ని ఫోన్ చేసి హెచ్చరిస్తాడు. వేగంగా నడక సాగించాను. అనుకున్నట్టుగానే గూర్ఖా బూత్‌లో వున్నాడు ఫోన్‌లో ఆదేశాలు వింటూ.

చటుక్కున డోర్ లాగి, గడియపెట్టేసి చక్కా పోయాను.

ఆఫీసుకు చేరుకునేసరికి బాగా చీకటిపడింది....ఇంకా హోటల్‌లో గది తీసుకోనేలేదు. ఆ ఓపిక కూడా ఇప్పుడు లేదు. ఆఫీసులోనే పడక వేయాలనుకుంటూ ప్రవేశించాను. చోప్రా గాభరగా చూశాడు నన్ను.

"సుందర్, రాబర్టునుంచి ఫోన్!"

"ఏమని?"

"మీ మిసెస్‌ని కిడ్నాప్ చేశారట!"

"వాట్!"

"మీరు వెంటనే బయల్దేరితే ప్లేన్ అందవచ్చు!" అతను ఫోన్ ఎత్తి చకచక నెంబర్ తిప్పుతున్నాడు.

నా అలసటంతా ఎగిరిపోయిందప్పుడు!

8

రాబర్టు అన్నాడు తలొంచుకొని విచారంగా.

"సుందర్, నేనిలా జరుగుతుందనుకోలేదు. ఆ వేళప్పుడు ట్రెయిను లేకపోతే ఆమె బస్సులో వెళ్ళిపోతానంది. కానీ అక్కడ డైరెక్టు బస్సు లేదు.

విజయవాడ వరకే వుంది. అయినా ఆమె అందులో వెళ్ళిపోయి అక్కడ మారతానంది. నే సెక్కించేశాను. కానీ ఆమె కూడా మనిషిని పంపాలని ఆలోచన రాలేదు."

"ఫోన్ ఎప్పుడొచ్చింది?" అన్నాను తీవ్రంగా ఆలోచిస్తూ.

"సాయంత్రం 5 గంటలకు. మీరు ఢిల్లీలో ప్రయత్నాలు మానుకొని తిరిగివచ్చేస్తే ఆమెని క్షేమంగా అప్పగిస్తామని షరతు పెట్టారు. ఏర్ పోర్టునుంచి మేం వెళ్ళేటప్పుడు ఎవరూ వెంటాడలేదు. కానీ తర్వాత బస్సుని ఎలా వెంటాడి కిడ్నాప్ చేశారో తెలియడంలేదు. ఎక్కడ చేశారో కూడా తెలియడంలేదు. విజయవాడ వరకూ వెళ్ళి చేశారో, లేక మధ్య స్టేజీల్లో ఏదో మిషతో దింపేసి ఆమెని తీసుకెళ్ళిపోయారో అర్థంగావడంలేదు."

"విజయవాడలో నే చేసివుండాలి," అన్నాడు శర్మకి

"మధ్యలో అవకాశం చిక్కివుండదు. అందుకే ఫోన్ చెయ్యడానికి అంత టైము పట్టింది."

తలవిదిలించాను. "ఓ. కే. అయితే వాళ్ళకు ప్రకాష్ చావు వార్త అయిదుగంటలవరకూ అందలేదు. నేను ఆరుగంటలకి కాషిక్‌ని కలుసుకున్నాను. అతను ఫోన్ చేసి తెలిపివుంటే ఈపాటికి తెలిసిపోతుంది. దాని రియాక్షన్ ఏమిటో మీకు తెలుసా?"

"ఆమెని చంపేస్తారా?"

"అది వాళ్ళ పద్ధతికాదూ, ప్రతీకారం తీర్చుకోడం?"

"సుందర్ సువ్విలా మాట్లాడకు."

"ఇంకెలా మాట్లాడాలి....ఇది వాస్తవం, జరగబోయేది."

రాబర్టు అన్నాడు ఆందోళనగా. "ఈ బిజినెస్‌లో మొకాసిన్స్ దిగారని మీరు చెప్పేవరకూ నాకు తెలీదు. ఉదయం నుంచీ ఆ బిచ్‌ని గాలిస్తున్నాను. పోలీసు మిత్రులతో ఫైల్స్ తీయించి ఫోటోలన్నీ చూశాను. అటువంటి ముఖంలేదు. ఆమె మొకాసిన్ మనిషయితే తప్పకుండా ఆ డాసియర్ గ్యాంగ్ దగ్గరే వుంటుంది ఇంకా. పారితోషికం తీసుకొని డెలివరీ ఇస్తారు. అప్పుడు కాషికేని మనం కనిపెట్టివుంటే ఆ ముహూర్తానికి ఊడిపడి దాన్ని దక్కించుకోవచ్చు. అది వేరే విషయం. అంత తీవ్రమైంది కాదు. కానీ మీ మిసెస్ గురించి ఏమిటి? ప్రాణాలతో చెలగాటం...."

అడ్డంగా తలూపాను. "ఆమెని అప్పుడే ఏమీ చెయ్యరనుకుంటాను. ముందు నన్ను కాంటాక్టు చేయాలి. అసలు చంపవల్సింది నన్ను. వాళ్ళు హెచ్చరిక చేసి నా రాకకోసం చూస్తూంటారు. ఏర్‌పోర్టునుంచి నన్నిక్కడ వెంటాడి వుంటారు. నే నిప్పుడు ఇంటికెళ్తాను.... లేపితే నన్ను దార్లోనే లేపెయ్యాలి. లేకపోతే ఇంటికి ఫోన్ చేసి తమ దగ్గరికి రప్పించుకోవాలి. ఏం జరుగుతుందో చూద్దాం!" అన్నాను లేస్తూ.

"అయితే మీ వెనుక నేనూ వస్తాను" అన్నాడు రాబర్టు కూడా లేస్తూ, "వాళ్ళు వెంటాడుతారేమో చూస్తాను. మీరు ఆటోలో వెళ్ళండి. మీ వెనుక కొంత సమయమిచ్చి నేను వస్తాను. మీ మీద దాడి జరిపితే వచ్చి ఆదుకుంటాను."

తలూపాను. ఇద్దరమూ బయటికి నడిచాం. రాబర్టు మెట్లదగ్గరాగిపోయాడు. నేను క్రిందకు వెళ్ళి ఆటోని పిల్చి ఎక్కాను బ్రీఫ్ కేసుతో. నా దగ్గరిప్పుడు రివాల్వర్

లేదు. దాన్ని చో[ప్రాకిచ్చేసాను. నా స్వంత రివాల్వర్ ఇంట్లోనేవుంది. ఆటో పోతోంటే రెండుమూడుసార్లు వెనక్కి చూశాను ప్రక్కనుంచి తొంగి. వెనుక మరో రెండు ఆటోలూ, ఒక కారూ వున్నాయి, ఆ వెనుక బస్సు వస్తోంది.

కారు అనుమానం కల్గించింది. అది రాబర్టు కారు కాదు. డ్రైవర్‌ని వేగం తగ్గించమన్నాను. నా అనుమానాన్ని తీరుస్తూ వెనుకనున్న ఆటోలతో సహా ఆ కారు కూడా దాటిపోయింది. ఏమీ జరగ లేదు. ఛాషింగ్ లేదు, షూటింగ్ లేదు.

కుతుటపడుతూ మరోసారి వెనుక చూశాను. అప్పుడు కన్పించింది రాబర్టు కారు. అంతే—ఆ తర్వాత ఇంటి వరకూ ఆ కారే వెంటాడుతూ వచ్చింది. మధ్యలో చాలా వాహనాలు వచ్చాయిగానీ, ఒక్కటీ పట్టుమని రెండు నిముషాలుండలేదు.

ఇంటిముందు ఆటో దిగి పంపేశాను.

రాబర్టు కారువచ్చి ప్రక్కన ఆగింది. అతను దిగి వచ్చాడు.

"వెల్?" అన్నాను.

"వెల్! మన వెనుక బాడీగార్డ్సు లేరు."

"ఫన్నీ ఫెలోస్, వెంటాడటం వాళ్ళ ఇంటా వంటా లేదనుకొంటాను."

నవ్వాడు రాబర్టు, "ఇప్పుడు మీకు ఫోన్ రావచ్చు. మీ మిసెస్ కోసం ఫలానా చోటికి రమ్మంటారు. వెళ్ళకండి. మిమ్మల్నిద్దర్నీ కలిపి అంతమొందించే ఆలోచన వుండొచ్చు వాళ్ళకు. అలా ఫోన్ వస్తే నాకు తెలియజేయండి. లేకపోతే మీతోపాటు నేనూ వుండనా?"

"అవసరంలేదు, వెళ్ళండి. మీరు నాకు కాదు, బాస్‌కు బాడీగార్డు."

రాబర్టు గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయాడు.

9

గేటు తెరిచి లోపలికి నడిచి తలుపు తాళం తీశాను.

శ్యామల గుర్తొచ్చి నా గుండె వేగం హెచ్చింది. సాలోచనగా తలుపు తోసి లోనికి అడుగుపెట్టాను చీకట్లో—అది పొరపాటయితే, ఆ పొరపాటు నా మంచికోసమే జరిగిందనుకోవాలి — చీకట్లో రెండు ఆకారాలు అకస్మాత్తుగా నా మీద విరుచుకుపడి, రెక్కలు విరిచిపట్టుకున్నాయి. బ్రీఫ్ కేసు జారిపోయింది. తెలివిలోకొచ్చాను. మౌనంగా వాళ్ళతో నడిచాను.

వాళ్ళు నన్ను లాక్కెళ్ళి కుర్చీలో కుదేశారు. చటుక్కున అప్పుడు లైటు వెలిగింది. కళ్ళు చెదిరాయి. తల విదిలిస్తూ చూశాను, వాళ్ళిద్దరు రివాల్వర్స్ గురిపెట్టి నిల్చున్నారు. కొత్త మొఖాలు. కానీ నా ఎదురుగా కూర్చున్న ముఖం తెలిసినదే—మమ్మల్ని అతితేలిగ్గా ఫూల్స్ చేయగల్గిన చలాకీ రాణి సుమిత్ర!

ఆమె రివాల్వర్ పట్టుకొని నిటారుగా కూర్చుంది. ఆమె కళ్ళు హేళనగా నవ్వుతున్నాయి.

"హలో, ప్రయాణం కులాసాగా జరిగిందా హీరో?"

నేను లేచి ఆమె మీదకి దూకబోయాను. ఆగంతకులు విరిచి కుదేశారు.

"శ్యామల ఎక్కడుంది? ఏం చేశారామెని?" అరిచాను తీవ్రంగా.

ఆమె పకపకా నవ్వింది. "ఎంత పిరికివాడివి! కాస్త హీరోలా కనపడు, ఢిల్లీ వెళ్ళి వచ్చినవాడివి!"

ఆమె మాటలకి రెచ్చిపోయాను. కానీ ఆగంతకులు నన్ను అదుపు చేశారు.

"చూడు హీరో, నువ్వు కాస్త వళ్ళు దగ్గర పెట్టుకో! వీళ్ళు పరమ కిరాతకులు. సహనం తక్కువ. ఈ బచ్చాగాడు గూబలు వాయిస్తాడు. ఈ తుగ్లక్ గాడు తుక్కు చేస్తాడు. అర్థమైందా? తర్వాత నేను హెచ్చరించలేదనకూడదు."

తలెత్తి వాళ్ళిద్దర్నీ చూశాను. బచ్చాగాడు బక్కగా తంతే, గాల్లోకి లేచేలా వున్నాడు. తుగ్లక్ గాడు గుండ్రాయిలా వున్నాడు. నున్నగా గుండు గీసుకున్నాడు.

"నువ్వొక టక్కరిచుక్కవి! నీ మొసలి కన్నీళ్ళతో చక్కగా నటించి మమ్మల్ని ఏమార్చావు. నిన్నిప్పుడు సన్మానించడానికి మా బాస్ ఎదురుచూస్తున్నారు" అన్నాను కసిగా.

"పెద్ద బఫూన్ మీ బాస్."

లేచి ఆమెని కొట్టబోయాను, ఆమె చేతిలో రివాల్వర్ని లెక్కచెయ్యకుండా. తుగ్లక్ నన్ను వెనక్కి తోశాడు. "లొల్లి చేయక కూకో బిడ్డ, పిస్తోళ్ళున్నాయి మాకాడ!"

బచ్చాగాడు రివాల్వర్ నా తలకానించాడు.

"సుందర్, నువ్వు ఎందుకెళ్ళావ్?" అందామె ధోరణిమార్చి కఠినంగా, "చింతిస్తావని మేం చెప్పలేదూ? అక్కడ మా మనిషిని పట్టుకోవాలనుకుని వెళ్ళావు. కానీ ఇక్కడ నీ భార్యని మేం పట్టుకోగలమని ఆలోచించలేదు. సరే, ఇప్పటికైనా నా పొరపాటు గ్రహించి తిరిగి వచ్చావు, సంతోషం. ఇప్పుడు నీతో మాకు—"

హఠాత్తుగా ఫోన్ మ్రోగడంతో ఆగిపోయిందామె.

నేను ఉలిక్కిపడి చూశాను. ఆగంతకులిద్దరూ ప్రశ్నార్థకంగా ఆమెకేసి చూశారు.

"ఎత్తకండి, అదే వూరుకుంటుంది" అందామె వారిస్తూ, "మన హీరో ఇంకా ఇంటికి రాలేదనుకుంటారు, ఏం సుందర్?"

నా రక్తం వురకలు వేసింది. ఎగిరివెళ్ళి రిసీవర్ ఎత్తాలనుకున్నాను. కానీ రివాల్వర్స్ నన్ను కదలనివ్వలేదు. ఫోన్ చేస్తోందెవరు? ఎందుకు?

"నెమ్మది, సుందర్! నెమ్మదిపడు!" అందామె.

అప్పుడు ఫోన్ నిశ్శబ్దమైపోయింది....

"పదండి, ఇక వెళ్ళిపోదాం!" అందామె చటుక్కున లేస్తూ.

తుగ్లక్ నా రెక్క పుచ్చుకు లాగాడు. "లెగు బిడ్డ, నిన్ను పెళ్ళాంకాడికి కొంటపోతాం."

"పోరా బాస్టర్డ్."

"సుందర్! నువ్వు మాతో రావాలి. మా బాస్ ఆజ్ఞ. నీతో ఒక కాగితం వ్రాయించుకుంటాం. నువ్వొప్పుకొని వ్రాసిస్తే నిన్ను సతీ సమేతంగా సాగనంపుతాం— క్షేమంగా ఇంటికి. లేకపోతే నువ్వొంటరిగా వెళ్తావు, నీ భార్య చావుచూసి."

"ఏమిటా కాయితం?"

"తెలుస్తుంది, పద!"

ఈ పరిమాణం విపరీతమనిపించింది. ఇది బ్లాక్ మెయిల్. అదెలాంటి కాగితమై వుంటుందో ఊహించగలను. దాంతో నా భవిష్యత్తు నా చేతిలో వుండదు. నా సర్వం వాళ్ళ స్వాధీనమైపోతుంది. శ్యామల ప్రాణాలు పణంగా వాళ్ళు నాచేత నన్ను బ్లేమ్‌చేసే సాక్ష్యం ఏదో సృష్టించుకో

పోతున్నారు.

అయితే ఇది కేవలం వాళ్ళ హెచ్చరిక పాటించని ఫలితమేనా? లేక ప్రకాష్ చావుకి ప్రతీకారం కూడానా? కానీ చావుకి ఇటువంటి శిక్ష ఎప్పుడూ విధించలేరు. ప్రాణానికి ప్రాణం తీసుకోవడం వాళ్ళ సిద్ధాంతం. మరి ఇప్పటి పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? వాళ్ళ కింకా ప్రకాష్ చావు తెలియదనా? అంతే అయ్యుండాలి. లేకపోతే ఈ క్షణంలో నేనిలా సజీవంగా ఉండే వాడినా!

10

వాళ్ళు ఇంటి వెనుక దారిగుండా తీసుకెళ్ళి నన్ను అక్కడున్న కార్లోకి ఎక్కించారు.

కారు బయల్దేరాక మళ్ళీ ఆ ఫోన్ కాల్ గుర్తొచ్చింది. ఎవరు చేసివుంటారు? ఎందుకు చేసి వుంటారు? ఏదైనా కొత్త పరిణామమా? అయితే మళ్ళీ చేస్తారు. అప్పుడూ రెస్పాన్స్ వుండదు. అప్పుడు శర్మకో, రాబర్టుకో అనుమానంవచ్చి ఇంటికొచ్చి చూస్తారు—

తుగ్లక్ కారు కుదుపుకి నామీదకి ఒరగడంతో ఆలోచనలకి అంతరాయం కల్గింది. వాళ్ళిద్దరు నా చెరో ప్రక్క కూర్చున్నారు. ఆమె డ్రైవ్ చేస్తోంది. వాళ్ళ ప్రవర్తన, పద్ధతి నాకు వింతగా తోచాయి. తమ ఉనికిని ఎంతో గుట్టుగా కాపాడుకుంటోన్న వీళ్ళు, నా కళ్ళకి కనీసం గంతలైనా లేకుండా తమ స్థావరానికి మార్గం తెలిసేలా ఎందుకు తీసుకెళ్తున్నారు?

కారు శరవేగంతో పంజాగుట్ట, సనత్ నగర్, కూకట్ పల్లీ దాటేసి, బాంబే రోడ్డుమీద చీకట్లో దూసుకుపోతోంటే అనుమానం వేసి అడిగాను, "మీ

సావరం సిటీవెలుపల దూరంగా వుందా?"

"సిటీ వెలుపల ఒక పెద్ద బావి వుంది" అందామె.

"వుంటే?"

"అందులో నిన్ను పడేస్తాం."

"నేను కాయితం వ్రాయనని చెప్పలేదే?"

"అక్కర్లేదు, వ్రాయనవసరంలేదు. అసలా కాయితం లేదు, కల్పించాను. నువ్వు గొడవచెయ్యకుండా వస్తావని. సుందర్, మా మొకాసిన్ గ్యాంగ్ గురించి నీకు బాగా తెలుసనుకుంటాను?"

"తెలుసు."

"మా గ్యాంగ్ దిగ్విజయంగా ఆపరేట్ చేస్తోంది" అందామె తీవిగా డ్రైవ్ చేస్తూ.

"మా శక్తిసామర్థ్యాలమీద మా క్లయంట్స్‌కి చాలా విశ్వాసముంది. దేశవ్యాప్తంగా వున్న మా క్లయంట్స్‌లో ఏ ఒక్కరు ఎన్నడూ మా సేవలు పొంది అసంతృప్తి చెందలేదు. అన్‌ఫిట్ అనలేదు. మొకాసిన్స్ ఆర్ ది మోస్టు కన్నింగ్ ఆపరేటర్స్ ఇన్ ది అండర్ వరల్డు బిజినెస్ అంటారెవరైనా...."

"అది తెలుసు, తెలియంది చెప్పు."

ఆమె నవ్వింది. "నీకు తెలియందేమిటి—మా ప్రొసీజర్ కోడ్ నీకు తెలుసు. మా మనిషి ఎవరైనా ఎవరి మూలంగానైనా చచ్చాడంటే, సుందర్, ఆ మూల పురుషుడు కూడా తకీమని చావాల్సిందే. దానికి తిరుగు లేదు. నీ విషయమే తీసుకో, నువ్వు ఢిల్లీ వెళ్ళి గూఢచారిలా మా ప్రకాష్‌ని చంపావు. అవునా?"

నా గుండె వేగంగా కొట్టుకుంది. ఏమీ అనలేక

పోయాను.

ఆమె వెనక్కి తిరిగి పకపకా నవ్వింది. "ఇప్పుడు నువ్వు మూలపురుషుడివి! మాకు ఫోన్ వచ్చింది ఇందాక కాషిక్ నుంచి. ప్రతాప్ చావు తెలిసింది. అంతేగాక కాషిక్ బాడీగార్డుని నువ్వు గాయపర్చి అవమానకర స్థితిలో వదిలి వచ్చావు. ఇంత సాహసం నీకెలా వచ్చింది? నువ్విప్పుడు చావబోతున్నావని తెలిసీ ఆ సాహసం— గట్స్ ఇంకా వున్నాయా?"

"వివరాలు కావాలి, నన్నెలా చంపుతారు?"

"అచ్ఛా, గట్స్ వున్నాయన్నమాట? అయితే దాచుకో, ప్రయోజనం లేదు."

ముందుకు విరుచుకుపడి ఆమె కంఠం పట్టుకున్నాను. యావత్ శక్తినీ నా చేతుల్లోకి తెచ్చుకొని కసిగా నలిపేయసాగాను. ఆమె ఉక్కిరిబిక్కిరై స్టీరింగ్ ని వదిలేసింది—కారు వంకరటింకరగా వెళ్ళింది. అప్పుడు చీకట్లో జరుగుతున్నది గ్రహించి అనుచరులిద్దరూ నన్ను లాగి సీట్లో కుదేశారు. బచ్చాగాడు లాగి నా గూబమీద కొట్టాడు. బాధగా అరిచాను.

"ఖబడ్దార్, బిడ్డ!" తుగ్లక్ అన్నాడు నా చొక్కా పుచ్చుకొని.

కారు అదుపులోకొచ్చి తిన్నగా దూసుకెళుతూంది.

"ఏమిటి, నువ్విప్పుడే చావాలనుకుంటున్నావా?" అందామె తిరిగి హుందాగా డ్రైవ్ చేస్తూ, "నీ భార్యని కడచూపులు చూసుకోవూ? అలాకాదు, మీరిద్దరూ కడచూపులు కళ్ళారా చూసుకొని కలిసి హరీమంటే చాలా బాగుంటుంది.... పునర్జన్మంటూ వుంటే చెట్టాపట్టా లేసుకు పుడతారు. ఏం తుగ్లక్?"

"ఠ్కైన మాట, ప్యారీబహెన్!" తుగ్లక్ అన్నాడు నావైపు తిరుగుతూ, "జన్మ జన్మల బంధం, బిడ్డ!"

"మేరే భాయ్, బలే తియ్యని చావురోయ్!" అరిచాడు బచ్చాగాడు.

తుగ్లక్ అన్నాడు. "అడ బాయి వుంది, బిడ్డ. మా ఏజెంట్లు సీ ఆడమనిషితో అడికి వస్తారు. మీ కాళ్ళకీ, చేతులకీ బిర్రుగా తాళ్ళు చుట్టి, పీకలకి ఇంతా పెద్ద బండకట్టి దాంట్లో దడాల్న ఎత్తేస్తాం, బిడ్డ. బుడుంగున మునిగి చస్తారు.... క్యా కే కంత్రీ, ఎలాగుంటుంది?"

"మేరేభాయ్, ఎంత ఆరాంగా వుంటుంది!"

"కిందకుపోయి ఆరాం తీసుకోండి, బిడ్డ. దాంట్లో చాలా శవాలున్నాయ్, గవన్నీ మీతో దోస్తీగా వుంటాయ్ హేహ్హా హిహ్హి ...."

బచ్చాగాడు నా గెడ్డం పట్టుకొని పాడ్డం మొదలెట్టాడు, "మేరే దోస్తుకిస్నా ఏ క్యా హోగయా...."

నేనలాగే మౌనంగా కూర్చున్నాను వింటూ. కారిప్పుడు పూర్తిగా సిటీ దాటేసి, హైవే దిగి, అడ్డమార్గాన మట్టి రోడ్డులో వెళుతోంది. చిమ్మచీకటిగా వుంది అంతా. చల్లటి గాలి ఈడ్చికొడ్తోంది. హెడ్ లైట్స్ వెలుగులో ముందంతా విశాలమైన మైదానం కన్పిస్తోంది. వెనుక దట్టమైన ధూళిమేఘం.

ఆమె హఠాత్తుగా వేగం తగ్గించి కుడివైపు తిప్పింది. గుంటల్లో పడ్తూ లేస్తూ నెమ్మదిగా సాగుతోంది కారు. ఇప్పుడు ఇరువైపులా చెట్లు కన్పిస్తున్నాయి. ఎత్తయిన వృక్షాలు, గుంపులు గుంపులుగా వున్నాయి. కింద ఏపుగా పెరిగిన గడ్డి. అలా కొంతదూరం వెళ్ళాక చిన్న బయలు ప్రదేశం వచ్చింది. అక్కడ చెట్లులేవు, గడ్డిలేదు.

అక్కడ కారాపి ఆమె లైట్లార్పేసింది. "దిగండి!" అంది తనూ దిగుతూ.

తుగ్లక్ చటుక్కున డోర్ తీసి దిగాడు. వెనుక నేను దిగాను. అవతలనుంచి బచ్చాగాడు దిగాడు. వాళ్ళిద్దరు నన్ను కారుముందుకి తీసుకొచ్చారు. ఆమె నా ముందు కొచ్చి రివాల్వర్ గురిపెట్టి వాళ్ళతో అంది, "మీరు వెళ్ళి ఏర్పాట్లు చూడండి!"

"మన ఏజెంట్లు ఇంకా రాలేదేమిటి, బహెన్?" తుగ్లక్ అన్నాడు.

"వచ్చేస్తారు పది నిముషాల్లో, నువ్వెళ్ళు!"

"రైట్! నువ్వెళ్ళి తాళ్లు తీయ్ బచ్చా, నేను బండ ఎత్తుకొస్తా!"

వాళ్ళిద్దరూ కదిలారు. బచ్చాగాడు వెనక డిక్కీ దగ్గర కెళ్ళాడు. తుగ్లక్ చీకట్లో దూరంగా మాయమైయ్యాడు.

అంతటా నిశ్శబ్దం ఏర్పడింది. కటిక చీకటిగా వుంది. సుమిత్ర ఏదో చెప్తోంది. నేను విన్పించుకోడంలేదు. చుట్టూ చూస్తున్నాను. ఆ దగ్గర్లోనే ఎక్కడో బావి వుండాలి. దాంట్లో చాలా శవాలున్నాయన్నారు. ఇప్పుడు వాటితో మేమూ కలుస్తాం. బావిలో శవాలు! తలుచుకోగానే ఒళ్ళు గగుర్పొడిచింది.

శ్యామల! నా గుండె వేగంగా కొట్టుకుంది. రక్తం ఉరికింది. సందేహించకు సుందర్, సాగిపో! తొందర పెట్టింది మనసు. సమయంలేదు, సాహసించు!

"అదుగో శ్యామల వచ్చేస్తోంది, శ్యామలా!" కేక పెట్టాను కెవ్వున.

ఆమె అదిరిపడి వెనుదిరిగింది. చాలు—ఆమె మెడ మీద రెండు చేతులూ బిగించి కొట్టి కాలితో రివాల్వర్ని

ఎగరగొట్టాను. ఆమె కీచుగా అరుస్తూ నామీదకి రాబో తూంటే ముఖంమీద ఫ్లాష్‌లైటుని కొట్టాను. ఆమెకు ఊపిరి సంభ్రమించి గిరగిరా తిరిగింది—బొంగరంలా. మరో దెబ్బ వీపుమీద కొట్టడంతో విసురుగా నిశ్శబ్దంగా వెళ్ళి పడింది—చీకట్లో ఎక్కడో! అప్పుడు పెద్దగా కేక, ఆ వెంటనే నీళ్ళ చప్పుడూ విన్పించాయి. అక్కడేవుండాలి బావి! ఆమె బావిలోపడింది!

"ఏం జరిగింది, బహెన్?" బచ్చాగాడు ఉరికి వచ్చాడు మెరుపు వేగంతో. వాడ్నలాగే రానిచ్చి అదే క్షణంలో, అదే వేగంతో, కాలెత్తి వాడి రెండుకాళ్ళ మధ్య లాగి తన్నాను బలంగా. ఒక హృదయవిదార కరమైన కేక. కిందపడి దొర్లుతున్న చప్పుడు—అప్పుడు నీళ్ళు చేసిన పెద్ద ధ్వని!

"బచ్చా, ఏం జరిగింది?" తుగ్లక్ అరుపు విన్పించింది దూరంగా. వెంటనే నేలమీద తడిమి సుమిత్ర పడేసిన రివాల్వర్ అందుకున్నాను. వేగంగా వురికి కారు వెనక నక్కాను. తుగ్లక్ కేక వేస్తూ పరుగెత్తుకొచ్చాడు, "చెల్లమ్మా! ఒకేయ్ చిడియా! సప్పుడు చెయ్యరేంటి మల్ల!"

సరిగ్గా అదేక్షణంలో నా చేతిలో రివాల్వర్ చప్పుడు చేసింది. దిక్కులదిరే గావుకేక. పిచ్చిపిచ్చిగా బుల్లెట్లు వచ్చి కారుకి తగుల్తున్నాయి. అర నిముషంపాటు విప రీతమైన రొద! ఆ మరుక్షణం హఠాత్తుగా నిశ్శబ్దం.

కళ్ళు చీల్చుకొని చూశాను, నేలమీద అస్పష్టంగా కన్పిస్తోందొక ఆకారం. అలాగే గొంతుకూర్చుని దానికేసి జరిగాను, రివాల్వర్ సిద్ధంగా పట్టుకొని. దాన్ని సమీపించి చూశాను. కదలికలేదు. జాగ్రత్తగా తడిమి

చూశాను. రెస్పాన్స్ లేదు. సిగార్ లైటర్ వెలిగించి దానిమీద వెలుతురు వేశాను. కణతలో బుల్లెట్ గాయంతో నిర్జీవంగా పడివున్న తుగ్లక్ కాయం.

లైటర్ ఆరిపోవడంతో మళ్ళీ వెల్గించి, లేచి నాలు గడుగులు అవతలగా వేశాను. అక్కడ వుంది విశాలమైన గట్టులేని బావి. లోపల నీళ్ళు కన్పించడంలేదు, వెలుతురు సరిపోలేనిమూలాన. దట్టమైన చీకటిగా వుంది. కప్పలు అరుస్తున్నాయి. మరేదో జంతువు కూడా వికృతంగా శృతి కలుపుతోంది....వళ్ళు గగుర్పొడిచి వెంటనే కదిలి పోయాను. శవం దగ్గర నిల్చుని క్షణంపాటు సందే హించాను. గుండె చిక్కబట్టుకొని దాని కాళ్లు పట్టి లాక్కుంటూ వెళ్ళి బావిలోకి తోశాను. వెనక్కి చూడ కుండా కారు దగ్గరకి వురికాను.

అప్పుడే దూరంగా హెడ్ లైట్స్ కన్పించాయి.... వాళ్ళొచ్చేస్తున్నారు! తటాలున కారెక్కి స్టార్టుచేసి చెట్లమధ్యకి పోనిచ్చాను వేగంగా. అక్కడాపి వెంటనే దిగి నిలబడ్డాను రివాల్వర్ తో.

రెండు నిముషాల్లో ఆ కారువచ్చి ఆగింది బావిదగ్గర. లైట్లు ఆరిపోయాయి. అందులోనుంచి ఇద్దరు దిగారు. ఏవో మాటలు విన్పించాయి. టార్చి వెలిగింది....నా రక్తం వురకలు వేసింది. శ్యామల! ఆమెని సురక్షితంగా దక్కించుకోవాలి!

టార్చి వెలుగు చుట్టూపడుతోంది. "ఏ శ్శేమయ్యారు?" అందొక గొంతు.

"ఇంకా రాలేదనుకుంటాను" అంది మరో గొంతు.

"ఎందుకైంది ఆలస్యం?"

"ఆగు! ఇక్కడేదో వుంది .. రక్తం!"

టార్చి వెలుగు నేలమీద ఒకచోట నిలచింది.

"అవును.... అప్పుడే పని పూర్తి చేసి వెళ్ళిపోయారా?"

"కానీ షూట్ చెయ్యమని చెప్పలేదే?"

ఇద్దరూ బావిదగ్గరికి కదిలారు. టార్చి బావిలో వేశారు. మరుక్షణం అరుపు విన్పించింది, "ఛా, అటు చూడు! ఏమిటవి?"

"చెప్పులు.... ఆడవాళ్ళవి!"

"గాడ్, సుమిత్రవి కదూ?"

"అవును, ఏం జరిగిందిక్కడ?"

"తారుమారైంది, యాదవ్. ఆమెతోపాటు ఇద్దరూ పోయారు ఇందులోకి. ఆ రిపోర్టర్ తో సేసి పారి పోయాడు."

"చూద్దాం, పద! రివాల్వర్ పట్టుకో!"

వెనక్కి వచ్చేశారిద్దరూ. బాటవెంట కొందదూరం వురికారు, చుట్టూ టార్చి వేసుకుంటూ. నేను వెంటనే వాళ్ళువచ్చిన కారు దగ్గర కురికాను. విండోలోంచి తొంగిచూశాను ఆరాటంగా, "శ్యామల? నేనొచ్చే శాను...." అన్నాను.

కానీ సమాధానంలేదు. నా గుండె వేగం హెచ్చి నోరు తడారింది. చటుక్కున డోర్ లాగి సీటుమీద తడిమిచూశాను. ఖాళీ! కార్లో శ్యామలలేదు!

దగ్గరలో మాటలు విన్పించడంతో వెనక్కి తిరిగి వురికాను, అయోమయంగా. తలతిరిగిపోయింది. టార్చి వెలుగు నన్ను అనుసరిస్తూ పడింది. ఆ వెంటనే అరుపు, "యాదవ్, అదుగో కారు!"

తేరుకొని చెట్లమధ్యకి వురికాను. వాళ్ళిద్దరు కారుని సమీపించారు. టార్చి వేసి పరీక్షించసాగారు. "బుల్లెట్స

రంధ్రాలు....అందర్నీ షూట్ చేసి చంపేశాడు!"

"కానీ ఎక్కడికెళ్ళాడు, కారిక్కడ వదిలి?"

"సిటీకి రోడ్డుమీద లిఫ్ట్ సంపాయించి. ఈ కార్లోనే వెళ్తే మనం ఎదురుపడతామని భయపడివుంటాడు."

"ఓ. కే, వెంటనే బాస్‌కి తెలియజేయాలి. నువ్వీ కార్లో రా, నేనా కార్లో పోతాను" ఒక ఆకారం కదిలి వెళ్ళిపోయింది.

రెండో ఆకారం కారు డోర్ తీసింది. నేను నిశ్శబ్దంగా వెనుక చేరుకున్నాను.

"ఈ కార్లో నేను పోతాను, యాదవ్."

అతను అదిరిపడి చూశాడు, "నువ్వు—"

"నువ్వు వాళ్లోవాడివి, నా లక్కీ నెంబర్!"

రివాల్వర్ ఎత్తి నడినెత్తిమీద కొట్టాను ఫట్‌మని.

11

బేగంపేటలోని ఒక బంగళావరకూ ఆ కారును వెంటాడాను. అతనెక్కడా అనుమానించలేదు. తిన్నగా డ్రైవ్ చేసుకుంటూ పోయాడు.

బంగళాముందు గేటు దగ్గర ఆపిన వెంటనే లోపలి నుంచి ఒక మనిషి గేటు తెరిచి చెయ్యూపాడు. ఆ కారు కదిలింది. దాని వెనుక నేను పోనిచ్చాను.

లోపల ఆవరణంతా చీకటిగావుంది. బంగళాలో అక్కడక్కడా లైట్లు వున్నాయి. ఆ కారు ఎడమ వైపుగా వెళ్ళి గ్యారేజి ముందాగింది. అక్కడా దీపాల్లేవు. మనుషులెవరూ లేరు. అతను దిగి నా కారు దగ్గరికొచ్చాడు "యాదవ్, దిగు!" అంటూ.

నేను మాట్లాడకుండా అలాగే కూర్చున్నాను. అతను మళ్ళీ పలికాడు. నేను నిద్ర నటించాను. చీకట్లో నా

ముఖాన్ని అతను గుర్తించలేదు. అప్పుడు జరిగింది అంతా నేననుకున్నట్టు ...

అతను హాండిల్ తిప్పి డోర్ లాగి చూశాడు యాదవ్ ని పిలుస్తూ. అది రాలేదు. విండోలోంచి చెయ్యి పెట్టి నన్ను తట్టాడు. నేనదేపళంగా ప్రక్కకు ఒరిగిపోయాను. అప్పుడతను తలలోపలికి పెట్టి వంగాడు కంగారుగా, 'ఏమయింది, యాదవ్?' అంటూ — నేను గబుక్కున లేచి అద్దాన్ని పైకి లేపేశాను. అతను బాధగా అరవబోతే నోట్లో కర్చీఫ్ కుక్కి, రివాల్వర్ తో నెత్తిమీదకొట్టాను. నిశ్శబ్దంగా తలవాల్చేశాడు—

వెంటనే అవతలినుంచి కారు దిగి గేటు దగ్గరికి పరుగు తీశాను. నా వేగాన్ని చూసి అక్కడి మనిషి కంగారుగా లేవబోయాడు స్టూలుమీద నుంచి. లేచేంతలో అతని మీదపడి రివాల్వర్ తో నెత్తిమీద కొట్టాను. గంటన్నర దెబ్బ! మూర్ఛలోకి చెక్కేశాడు. స్టూలుమీద అలాగే కూర్చోబెట్టి వెనక్కి వురికాను.

అప్పుడే బంగళా వరండాలోకి ఓ యువతి వచ్చింది. పోర్టికోలోంచి పరుగెత్తివస్తున్న నన్ను చూసి అరవబోయింది భయంతో. ఆమె నోరైనా తెరవకముందే వెళ్ళి ఆమెని పట్టుకుని బలంగా కొట్టాను ముఖంమీద. కళ్ళు తేలవేసింది. జడపట్టి గుండ్రంగా తిప్పి వదిలాను. వెళ్ళి గోడకి కొట్టుకుని స్పృహ తప్పింది.

మెరుపులా హాల్లో దురికాను. అక్కడ సోఫాలో కూర్చుని రమ్మీ ఆడుకుంటోన్న ఇద్దరు నన్నుచూసి అదిరిపడి లేచారు— చేతులు జేబుల్లోకి వెళ్ళాయి. అవి బయటికి వచ్చేలోపు వాళ్ళ దగ్గరికి గెంతి ఒకడి నెత్తి బద్దలు చేశాను-కూలిపోయాడు, రెండోవాడు రివాల్వర్ తీసి

కాల్చబోయాడు. కాలెత్తి సకాలంలో దాన్ని ఎగరగొట్టాను దూరంగా. "ఇది రజనీకాంత్ షాట్!" అన్నాను.

"నువ్వెక్కడ్నుంచి వచ్చావ్?" అన్నాడతను చెయ్యి పట్టుకొని బాధగా. "హాలీవుడ్ నుంచి!" అన్నాను పిడికిలితో బిగించి ముఖంమీద బాదుతూ, "ఇది జిమ్ కెల్లీ పంచ్!" రక్తం చింది నోరుపట్టుకున్నాడతను. రివాల్వర్ తో బహుకరించాను, గంటన్నర ఘాతం!

అప్పుడు పక్కనున్న గదిలోంచి మరో ముగ్గురు బాణాల్లా దూసుకొచ్చారు. వాళ్ళందర్నీ కొట్టుకుంటూ పోయాను. వాళ్ళంతా గంటన్నర వాహ్యాళికి పోయాక, మేడమీదనుంచి మరో పార్టీ విరుచుకుపడింది. వాళ్ళప్పుడే నిద్రలేచినట్లున్నారు, చేతుల్లో ఆయుధాలేవీ లేకుండా పరుగెత్తి వచ్చారు. కానీ వాళ్ళకు నా దగ్గరలేని కండలున్నాయి. నల్గురూ కలిసి కట్టగా వచ్చిన నన్ను ఢీకొన్నప్పుడు కొండకి గుద్దుకొన్నట్టు ఉక్కిరిబిక్కిరై, "అబ్బ!" అని కష్టంగా నిట్టూర్చాను.

ఆ విసురుకు తూర్పు దిక్కుగా ఎగిరివెళ్ళి తలుపులకు కొట్టుకున్నాను. అవి భళ్ళున తెరుచుకోవడంతో గదిలో కాళ్ళపడ్డాను మెత్తమెత్తగా...ఆ చీకట్లో గమనించలేదు, నేనో పాప సౌందర్య సంపదమీద అక్రమంగా వెళ్ళి పడ్డానని. ఆమె అన్యాయమైపోయినట్లు గోలచెయ్యడంతో లేపి బయటకు గిరివాటేశాను, బ్రాందీబుడ్డిలా.

వాళ్ళొచ్చేశారు, అవురావురామంటూ, అంతకుముందే నేను మంచంమీంచిమాకి తలుపు ప్రక్కన దాక్కున్నాను. వాళ్ళొక్కొక్కరే అతి జాగ్రత్తగా, ఎంతో అనుభవజ్ఞుల్లా గదిలో అడుగుపెడుతోంటే వరుసగా గంట— గంటన్నర మధ్యలో వుండేట్లు చూస్తూ వడ్డించుకుంటూ

పోయాను—మూర్ఛ రసగుళికలు.

బయట బ్రాందీబుడ్డీ గోల ఎక్కువ చేసింది. పరుగున వెళ్ళి ఆమె బాబ్డు హెయిర్ దొరకబుచ్చుకొని, ఆ చెంపా ఈ చెంపా వాయించేసి, యాభై శాతం తగ్గింపుతో మూప్పావు గంట గుళిక ప్రకటించాను.

అప్పుడు హఠాత్తుగా నిశ్శబ్దమేర్పడింది. అతిథుల రాకలేదు. అయితే డిన్నర్ ముగిసిందనుకొని వేగంగా పైకి మెట్లెక్కాను. ఏ గదిలోనూ శ్యామల లేకపోవడం ఆందోళన కలిగించింది. పైన మూడు గదుల్లో కూడా లేదు. ఆందోళన ఇంకా ఎక్కువవుతోంటే మూసివున్న నాల్గో గది దగ్గరాగిపోయాను.

తలుపు లోపలినుంచి తాళం పెట్టి వుంది. కంతలు లేవు. లోపల అలికిడిలేదు. తలుపు క్రిందనుంచి వెలుతురు ప్రసరిస్తోంది....

నిశ్శబ్దంగా పక్క గదిలోకెళ్ళి బాల్కనీలోకి దూకి నాల్గో గది కిటికీని సమీపించాను. అద్దాల రెక్కలు. లోపల తెరలు వ్రేలాడుతున్నాయి. ఛళ్ళున అద్దం పగుల గొట్టేసి, చెయ్యి లోపల పెట్టి గడియ లాగి రెక్కలు తెరిచేశాను. కెవ్వున కేక వెలువడింది.

ఆమె బెడ్ మీదనుంచి దూకేసి తలుపు దగ్గరికి వురికింది.

అతను అలాగే పడుకుని కళ్ళు పెద్దవిచేసి చూశాడు నాకేసి.

“హూ ఆర్యూ?” గద్దించింది అతని స్వరం.

“యువర్ ఆనర్ బుల్ గెస్టు, సర్.”

“ఆయాం ది బాస్ హియర్!”

“ఐ డోంట్ కేర్.”

కిటికీ దూకి అతన్ని సమీపించాను. మొకాసిన్ గ్యాంగ్ లీడర్ గభాల్న లేచి కూర్చోబోయాడు. కానీ సాధ్యంకాలేదు. బోర్లాపడ్డాడు. సంకల్పమున్నా శరీరం పెద్ద అవరోధంగా పెరిగిపోయింది. పైగా మితిలేకుండా తాగేశాడని ప్రక్కనున్న సీసాలు చెప్తున్నాయి.

"హో! నువ్వు రిపోర్టర్ వి కదూ?" అప్పుడరిచాడు నన్ను గుర్తుపట్టి.

"అవును, నువ్వు నా సీతను చెరబట్టిన రావణాసురుడివి!" రివాల్వర్ ఎత్తి అతని బట్టతలమీద ప్రతిష్ఠించాను.

"నీ భార్య ఇక్కడ లేదు!" గొణిగాడతను తల రుద్దుకుంటూ.

మరోసారి కొట్టాను. "తర్వాత చెబుదువుగాని, పోలీసులకి! రెస్టు తీసుకో."

అతను దిండులో ముఖం దాచుకొని మూర్ఛలోకి చెక్కేశాడు.

ఆ యువతి మరోసారి అరిచి తలుపు తీయబోయింది—

"హాయ్, స్వీట్! నువ్వెక్కడికి? నీ లవర్ తో పాటే నువ్వూ!"

ఎగిరి వెళ్ళి ఆమె నెత్తిమీద కొట్టాను. అక్కడికక్కడే పడిపోయింది.

గబగబా అతని నైట్ గౌన్ జేబులు వెతికి తాళాల గుత్తి తీసుకున్నాను. అందులో అష్టవంకర్లు తిరిగిన తాళంచెవి ఒకటి వుంది-అదే నాక్కావల్సింది. వేగంగా తిరుగుతూ గదిలో ఫాల్స్ గోడల కోసం చూశాను. కనిపెట్టలేకపోయాను. అప్పుడు మీటలకోసం వెతికాను. అవి కన్పించాయి సులభంగానే. బెడ్ మీద, తలగడవైపు

పరుపుకింద అమర్చి వున్నాయి రెండూ. నొక్కేశాను. మొదటిదానికి అలారం మ్రోగింది. రెండోదానికి ఎదురుగా గోడకున్న ర్యాక్ తొలగిపోయి ద్వారం ఏర్పడింది.

వేగంగా ఆ రహస్య ద్వారంలోకి వురికాను. అవతల చిన్నగదిలో ఎర్రదీపం వెలుగుతోంది గుడ్డిగా. లోపలికెళ్ళి సూటిగా సేఫ్‌ను సమీపించాను. తాళం చెవితో తెరిచేశాను.

లోపల గ్యాంగ్‌కు సంబంధించిన కార్యకలాపాల భోగట్టా అంతా వుంది—ఫైళ్ళూ, పత్రాలరూపంలో. నాక్కావల్సిన పత్రాలు సులభంగానే లభించాయి. క్లాషిక్ డోసియర్. దానితోపాటు మొకాసిన్స్ సహాయాన్ని అర్థిస్తూ క్లాషిక్ వ్రాసిన ఉత్తరం!

నా గుండె వేగం హెచ్చి సంతోషంతో ఒక్క కేక వేశాను.

ఈల వేసుకుంటూ తిరిగివచ్చి ఫోన్ చేశాను పోలీసులకి.

"హలో, దిసీజ్ సోమసుందర్ స్పీకింగ్. రిపోర్టర్, బ్లేడ్ వీక్లీ, రిపీట్—"

"యస్, యస్, తెలుసు. ఏమిటి సంగతి సుందర్?"

"చూడండి, పత్రికల్లో నా పేరు ప్రముఖంగా రావాలి. ఈ క్రెడిట్ నాకే దక్కాలి. లేకపోతే మా బాస్ వూరుకోరు. నే నిప్పుడొక పర్సనల్ పనిమీద వెళ్తున్నాను, ఇక్కడంతా మీరే చూసుకోవాలి."

"ఆల్ రైట్, చెప్పండి."

మొకాసిన్ గ్యాంగ్ గురించి, బావిలో శవాల గురించి వివరంగా చెప్పాను.

"అదీ సంగతి!" వాళ్ళకు అడ్రసు చెప్పి లైను కట్

చేశాను.

తిరిగి ఆఫీసుకి ఫోన్ చేసిన వెంటనే శర్మ పలికాడు.

"సర్, ఇందాక మీరు నాకు ఫోన్ చేశారా?"

"రెండుసార్లు! గాడ్, సుందర్! ఎక్కడున్నావు? నేను మీ ఇంటికొచ్చాను—"

"ఎందుకు ఫోన్ చేశారు?"

"శ్యామల ఫోన్ చేసింది!"

"ఏమిటీ!"

"శ్యామల ఫోన్ చేసింది, ఆమె ఊర్నుంచి!" అరిచాడు శర్మ.

పరిగుత్తాను, ఫోన్ పెట్టేసి.

12

శర్మ అన్నాడు నవ్వుతూ. "బఫూన్స్ ది గ్రేట్, మనమంతా. మన సైకాలజీని ఆసరా చేసుకొని వాళ్ళొక ఆట ఆడారు. మనల్ని ఫూల్స్ చేశారు, కిడ్నాప్‌ని బుకాయించి. నీ సంగతి ఎలావున్నా నాకిప్పుడు చచ్చేంత అవమానంగా వుంది. ఎక్కడ ముఖం దాచుకోవాలో తెలియటంలేదు."

"శ్యామల ఏం చెప్పింది? ఎందుకింత రాత్రి ఫోన్ చేసింది?" అన్నాను తేలిగ్గా నిట్టూరుస్తూ.

"నిద్రపోతే పీడకలలొస్తున్నాయట, నీ క్షేమం తెలుసుకుందామని ఫోన్ చేసింది....నువ్వు విజయవంతంగా తిరిగొచ్చావని చెప్పాను. సంతోషించింది. కానీ, ఆమెను గురించి మనం ఎలా కంగారుపడ్డామో విని పగలబడి నవ్వింది. నెంబర్ ఇచ్చి, నిన్ను కాంటాక్టు చేసి తనని పిలవమంది. కాని ఇంటికి రెండుసార్లు ఫోన్ చేసినా నువ్వు లేవు. ఏదో శంకించి నీ ఇంటికెళ్తే—"

"కాల్ బుక్ చేశారా?"

"చేశాను."

"బ్రతికించారు. నా ప్రాణం ఇప్పుడు కుదుటపడింది. నా మనసు ఇప్పుడు నెమ్మదిపడింది. హమ్మయ్య, రిలాక్స్ అవుతాను."

"కానీ మీ అవతారమేమిటి? ఏం జరిగింది?" రాబర్టు అన్నాడు.

జేబులోంచి కవరుతీసి అతనిముందు పడేశాను. అసిస్టెంట్ ఎడిటర్ మంచినీళ్ళందించాడు. తాగి మూతి తుడుచుకున్నాను.

"ఏమిటిది?" అడిగాడు రాబర్టు.

"స్టోలెన్ ప్రాపర్టీ కలెక్టడ్."

శర్మ చటుక్కున దాన్ని లాక్కొని విప్పి చూశాడు. "డాసియర్! ఇది.... ఇదెక్కడిది!" అరిచాడతను గబుక్కున లేచి.

"డాసియర్‌తోపాటు కాషిక్ తనపై సగర్వంగా జారీచేసుకున్న అరెస్టు వారెంట్ కూడా వుంది, చూడండి" అన్నాను.

శర్మ చూసి సంతోషంతో ఒక్క కేకవేశాడు. ఆనందం పట్టలేక గంతులేయసాగాడు. నన్ను పట్టిలేపి గదిలో చుట్టూ తిప్పుతూ డాన్స్ చేయసాగాడు. విధిలేక నేనూ చేశాను. రాబర్టు, మోహన్‌లు పగలబడి నవ్వుతున్నారు మమ్మల్ని చూసి....

అప్పుడు హఠాత్తుగా ఫోను మ్రోగింది—

శర్మని విడిపించుకొని రిసీవరెత్తాను.

ఆపరేటర్ గొంతు ఫలానావారు ఫలానా వారితో ఇక మాట్లాడుకోవచ్చని చెప్పి తప్పుకుంది.

"హలో, శ్యాం! శ్యాం! శ్యాం! మై లవ్."

"ఓహ్, నేనే! ఏమిటి, ఏదో కంగారుపడిపోతున్నారట?"

"నిన్ను కిడ్నాప్ చేశారని—"

"నన్నెవరు కిడ్నాప్ చేస్తారు? దమ్ములుండాలి. నేనిక్కడ క్షేమంగానే చేరుకున్నాను. వాళ్లెవరో మిమ్మల్ని ఆటపట్టించారు."

"అవును, మమ్మల్ని బుకాయించి పని వెళ్ళదీసుకోవా లనుకున్నారు."

"మీరెలా వున్నారింతకీ!"

"ఎలా వున్నానని కాదు, ఏం చేశానో రేపు పేపర్లో చూడు!"

"అబ్బో....హీరోయిజమా?"

"అంతే....హీరోయిజమ్."

అవతల నవ్వు. "వాళ్ళెవరో నిజంగానే నన్నెత్తుకు పోతే ఎంత బాగుండేది! మీకు బుద్ధొచ్చేది!"

"నాకు బుద్ధొచ్చింది శ్యాం, శర్మ చెప్పాడు."

"ఏం చెప్పాడు?"

"ఇక్కడ గొడవలు ముగిశాక ఫోన్ చేస్తాను, వెంటనే వచ్చేయ్. నీకు కొత్త జీవితాన్నిస్తాను."

"కొత్త జీవితమా?"

"అవును డియర్, నిన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తాను!"

"అంటే చక్కిలిగింతలు పెడతారా?"

"షటప్, యూనాటీ....నీ భావ జాగ్రత్త!" అరిచి ఫోన్ పెట్టేశాను.

వాళ్ళు ముగ్గురు ముసిముసిగా నవ్వుకుంటున్నారు.

—:అయిపోయింది:—